పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నంచడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 56 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 30 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :56 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM FRI 30 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

తుపాను బాధితులకు అండగా నిలవండి

పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు

- ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తిగా విఫలమయ్యాయని జగన్ విమర్శ
- టీడీపీ నేతలు బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:అర్నబ్ తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సహాయక చర్యలు విఫలమయ్యాయని విమర్శించారు.

- మిగతా 2లో

అర్నబ్ తుపాను అనంతర చర్యలు.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్!

- అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల వేగవంతం
- అంటువ్యాధుల నివారణకు పవన్ కల్యాణ్ ఆదేశాలు
- 9 జిల్లాల నుంచి 475 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు

పెన్ పవర్ డెస్క్:అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, ప్రజారోగ్యం విషయంలో ఎలాంటి ఆపద తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు త్వరగా నెలకొనేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలను వేగంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 జిల్లాల నుంచి మొత్తం 475 మంది సిబ్బందితో

- మిగతా 2లో

- పొత్తు ధర్మాన్ని తప్పనిసరిగా పాటించాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- ఎన్డీఏ రెబల్ అభ్యర్థులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశం
- అభ్యర్థులను కాకుండా ఎన్డీఏను చూసి ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి

పొత్తు ధర్మాన్ని ఎలాంటి పునరాలోచన లేకుండా పాటించాల్సిందేనని, ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్న రెబల్ అభ్యర్థులను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు.

పెన్ పవర్ డెస్క్:ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కలిసి ఎంతో శ్రమించి సీట్ల సర్దుబాటు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు, నేతలకు దీనిపై సానుకూల సందేశం పంపామని, కాబట్టి ఓటర్లు అభ్యర్థులను కాకుండా ఎన్డీఏ కూటమిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఈ చర్చలో జోక్యం చేసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముగ్గురు నేతలు కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయంపై ప్రజలు, కార్యకర్తల నుంచి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. మంత్రులు కేవలం తమ నియోజకవర్గాలపైనే కాకుండా, వారికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జిల్లాల బాధ్యతలను

కూడా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు బాధ్యత మంత్రులదేనని తేల్చిచెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తర్వాత పంచాయతీ, సొసైటీ ఎన్నికలు వస్తాయని, వాటికి ఇప్పటినుంచే సిద్ధం కావాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఏవైనా వివాదాలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని, ఆ తర్వాత ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

- మిగతా 2లో

కొందరు తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారు.. తర్వాత వాస్తవం తెలుసుకున్నారు: సీఎం చంద్రబాబు

- అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే
- బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా
- రెండు రోజుల్లో 100% విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యమని ప్రకటన
- రూ.4600 కోట్ల ప్రాథమిక నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక
- నష్టపోయిన రైతులకు పరిహారం, పునరావాస శిబిరాల నుంచి వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీ

కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుంది

- నగరి చైర్మన్ పీఠాన్ని కుట్రతో ఏకగ్రీవం చేసుకున్నారన్న రోజా
- చైర్మన్ ఏకగ్రీవంపై హైకోర్టులో పిటిషన్ వేశామని వెల్లడి
- టీడీపీకి తొత్తుగా మున్సిపల్ కమిషనర్ వ్యవహరించారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే వారు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా తీవ్రంగా విమర్శించారు. నగరి మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బైక్ ర్యాలీ, ఓపెన్

- మిగతా 2లో

అమెరికా ఒప్పందంతో భారత్‌కు లాభదాయకమే..

ఒక్క ప్రయోజనం కూడా దెబ్బతినదు: పీయూష్ గోయల్

- అమెరికా వాణిజ్య ఒప్పందంతో రైతులకు నష్టం జరగదన్న కేంద్ర మంత్రి
- రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడలేదని స్పష్టీకరణ
- అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై రైతు సంఘాల ఆందోళన
- ఈ ఒప్పందంతో భారత్‌కే ఎక్కువ ప్రయోజనమని గోయల్ వ్యాఖ్య
- సుంకాల తగ్గింపుపై త్వరలో వెలువడనున్న పూర్తి వివరాలు

- మిగతా 2లో

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై డ్రోన్ దాడి.. 13 మంది మృతి

పెన్ పవర్ డెస్క్: రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా ఉక్రెయిన్‌లోని ఓ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై మాస్కో దళాలు డ్రోన్ దాడికి పాల్పడటంతో... ఓ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై మాస్కో దళాలు డ్రోన్ దాడికి చోటుచేసుకుంది. పోరిజియాకు

- మిగతా 2లో

పార్లమెంట్ రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు పెట్టండి:

మోడీకి ఖర్గే కౌంటర్

పెన్ పవర్ డెస్క్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సవాల్ విసిరారు. బీజేపీకి తమ ఎన్నికల పనితీరుపై అంతగా నమ్మకముంటే తక్షణమే పార్లమెంటును రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించాలని ఛాలెంజ్ చేశారు. ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క

- మిగతా 2లో

ఏపీ సీఎం చంద్రబాబును అభినందిస్తున్నా

పెన్ పవర్ డెస్క్:“తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఉన్నా ఏపీలో కరవు లేదు. చంద్రబాబు ముందు చూపుతో నీళ్లు ఎత్తిపోసుకున్నారు. నీళ్లు ఎత్తిపోసుకోవడం

- మిగతా 2లో

తిరుమలలో నీటి కొరత లేదు

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

- తిరుమలలో 150 రోజులకు సరిపడా నీటి నిల్వలు
- వర్షాలు ఆలస్యమైనా ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు
- డ్యామ్‌లను పరిశీలించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు
- నీటి భద్రతకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడి
- సీఎం చంద్రబాబు దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు వెల్లడి

- మిగతా 2లో

ఇంట్లో పాతిపెట్టిన డ్రమ్ముల్లో.. రూ.కోట్ల విలువైన నోట్ల కట్టలు

పెన్ పవర్ డెస్క్: ఉత్తర్ ప్రదేశ్‌లోని ఓ ఇంట్లో సోదాలు నిర్వహించిన పోలీసులకు భారీ మొత్తంలో నగదు లభ్యమైంది. పాతిపెట్టిన డ్రమ్ములను వెలికి తీయగా నోట్ల కట్టలు బయటపడ్డాయి. రూ.కోట్లలో నగదు లభించడం స్థానికంగా సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. దొంగతనాలు చేయగా వచ్చిన డబ్బును ఇక్కడ పాతిపెట్టి ఉంటారని భావిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని రాకేశ్ యాదవ్ అలియాస్ మహాకాళ్ అనే వ్యక్తి ఆస్తులపై స్థానికులకు పలు అనుమానాలున్నాయి. అతడి పూర్వీకుల ఇంట్లో భారీ మొత్తంలో విలువైన వస్తువులు

- మిగతా 2లో

మియాపూర్‌లో 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

సుప్రీం కీలక తీర్పు

పెన్ పవర్ డెస్క్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ సర్వే నెంబర్ 100, 101లో భూ వివాదంపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించింది. ఈ రెండు సర్వే నెంబర్లలో 550ఎకరాల భూమి తమదేనంటూ కొందరు గతంలో ఆక్రమించే ప్రయత్నం చేశారు. అయితే..

- మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

యూపీలో టగ్ ఆఫ్ వార్... కమలానికి డేంజర్ బెల్స్

ఉత్తరప్రదేశ్ శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బీజేపీకి తిరుగులేని కంచుకోటలుగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ చొచ్చుకుపోయింది. మొత్తం 11 స్థానాలు 5 గ్రాడ్యుయేట్స్, 6 టీచర్స్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో అధికార బీజేపీ 5 స్థానాలను గెలుచుకోగా, అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 4 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. కేవలం ఒక్క సీటు తేడాతో అధికార పార్టీ మెజార్టీని అడ్డుకోవడమే కాకుండా, విద్యావంతులు, ఉద్యోగుల వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఈ ఫలితాల ద్వారా ఎస్పీ స్పష్టమైన రాజకీయ సందేశాన్ని పంపింది. ఈ ఫలితాల్లో అత్యంత విస్మయకరమైన అంశం ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని ఎస్పీ కైవసం చేసుకోవడం. కాషాయ పార్టీకి కంచుకోట లాంటి వారణాసిలో బీజేపీ అభ్యర్థిని మట్టికరిపిస్తూ ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ సాధించిన విజయం లక్నో నుంచి ఢిల్లీ దాకా చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా మేధావులు, విద్యావంతులకు కేంద్రమైన అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్స్ స్థానంతో పాటు ఆగ్రా డివిజన్లలో సైతం సమాజ్‌వాదీ పార్టీ విజయదుందుభి మోగించింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇలాకా గోరఖ్‌పూర్, మీరట్ తదితర స్థానాల్లో బీజేపీ బయటపడినప్పటికీ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రుల స్థానాల్లో ఎస్పీ సాధించిన ఈ స్ట్రైక్ రేట్ కమలనాథులను ఆత్మరక్షణలోకి నెట్టింది. సాధారణంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలంటే బీజేపీ, ఆరెస్సెస్ అనుబంధ సంఘాలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్న సంప్రదాయానికి ఈ ఫలితాలు గండికొట్టాయి. నిరుద్యోగ సమస్య, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ డిమాండ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ వంటి క్షేత్రస్థాయి అంశాలను ఎస్పీ ఎన్నికల అస్త్రాలుగా మార్చుకోవడంలో పూర్తిస్థాయిలో సఫలీకృతమైంది. యువత, మధ్యతరగతి ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మలచుకోవడంలో అఖిలేష్ యాదవ్ నెరిపిన సైలెంట్ ఆపరేషన్ తిరుగులేని ఫలితాన్ని ఇచ్చింది. కేవలం యాదవులు, మైనార్టీల ఓటు బ్యాంకు మాత్రమే కాకుండా.. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాల్లోనూ తమకు తిరుగులేని ఆమోదం లభిస్తోందని ఈ 4 ఎమ్మెల్సీ విజయాల ద్వారా ఎస్పీ నిరూపించుకుంది. రాబోయే ఎన్నికలకు ముందు విపక్ష శ్రేణుల్లో ఈ విజయం కొత్త ఊపును తీసుకురాగా, పట్టణ-విద్యావంతుల ఓటర్లను తిరిగి ప్రసన్నం చేసుకునేందుకు సరికొత్త వ్యూహాలు రచించాల్సిన అనివార్యతలోకి అధికార బీజేపీ వెళ్లిపోయిందిద

తుపాను బాధితులకు అండగా నిలవండి

- మొదటి పేజి తరువాయి

అధికార పార్టీ నేతలు 'బియ్యం మాఫియా'ను ప్రోత్సహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 'గ్రామ, వార్డు సచివాలయాల నిర్వీర్యం, వాలంటీర్ల వ్యవస్థ రద్దు ప్రభావం తుపాను సహాయక చర్యలపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం విపత్తులను ఆదాయ వనరుగా మార్చుకోవాలనుకుంటోంది' అని విమర్శించారు. సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని కీలక నేతలే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. 'మంత్రి పయ్యావుల వియ్యంకుడు సహా టీడీపీ నేతలు బియ్యాన్ని మార్కెట్లోకి రానీయకుండా బ్లాక్ చేసి, ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారు' అని జగన్ వ్యాఖ్యానించారు. తుపాను కారణంగా వరి, ఆక్వా, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని జగన్ స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుంది

- మొదటి పేజి తరువాయి

టాప్ వాహన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ అధికార కూటమిపై విరుచుకుపడ్డారు. "నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే పోటీ చేసి గెలవాలి కానీ, వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారు. నగరి మున్సిపల్ ఛైర్మన్ పదవిని కుట్రపూరితంగా ఏకగ్రీవం చేసుకున్నారు" అని రోజా ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ టీడీపీకి తొత్తుగా వ్యవహరిస్తూ, సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతో ఈ ఏకగ్రీవానికి సహకరించారని ఆమె ఆరోపించారు. స్క్రూటినీలో ఆమోదం పొందిన తమ అభ్యర్థి నామినేషన్‌ను తర్వాత ఎలా తిరస్కరిస్తారని ప్రశ్నించారు. ఈ ఏకగ్రీవాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశామని, తమకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని రోజా స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లుగా నగరిలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని, వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో సైకిల్‌ను తుక్కు తుక్కుగా ఓడించి, కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

కొందరు తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారు.. తర్వాత వాస్తవం తెలుసుకున్నారు: సీఎం చంద్రబాబు

"తుపానును మనం పూర్తిగా నివారించలేం. కానీ, మనకు ఉండే ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొని ఎవరికీ ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తీసుకుంటాను" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం నేపథ్యంలో గురువారం ఆయన కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ చర్యలను, భవిష్యత్ ప్రణాళికలను సుదీర్ఘంగా వివరించారు.

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం తగ్గించాం

గతంలో 1977 దివిసీమ తుపాను, 1996 కోనసీమ తుపాను సృష్టించిన విధ్వంసాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, ఆ అనుభవాలతో ఈసారి పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "ఈసారి ఒకే ఒక్క టార్గెట్ పెట్టుకున్నాను, ప్రాణనష్టం సున్నాగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దురదృష్టవశాత్తు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. టెక్నాలజీని ఉపయోగించి తుఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. రాత్రంతా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ విభాగాలను మోహరించాం. ఏ ప్రాంతంలో ఎంత తీవ్రత ఉంటుందో నిమిష నిమిషానికి సమాచారం అందించాం. దీనివల్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం" అని ఆయన వివరించారు. కొంతమంది తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారని, కానీ తీవ్రత పెరిగాక వాస్తవం గ్రహించారని అన్నారు.

30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు కళ్లముందు..

ఈ సందర్భంగా 30 ఏళ్ల క్రితం 1996లో వచ్చిన తుఫాను నాటి భయానక పరిస్థితులను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

"ఆ రోజు నా కళ్ల ముందు ఆ దృశ్యాలు ఇంకా కదలాడుతున్నాయి. అప్పుడు ప్రైవేట్ ఫ్లైట్స్ లేవు, డిఫెన్స్ విమానంలో వచ్చాను. ఆర్మీ హెలికాప్టర్ సిబ్బంది ప్రాణాపాయం ఉంటుందని నన్ను తీసుకెళ్లలేమని చెప్పినా, నేను బలవంతం చేసి వెళ్లాను. రోడ్డు మీద దిగి మత్స్యకార గ్రామాలను చూస్తే భయంకరమైన దృశ్యాలు కనిపించాయి. ముమ్మిడివరం, అమలాపురంలో దిగి ప్రజలకు ధైర్యం చెప్పి, రాజమండ్రి ఆర్డీవో ఆఫీసునే సెక్రటేరియట్‌గా మార్చి, ప్రతి మండలానికి ఒక సెక్రటరీని నియమించి వారం రోజుల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చాం. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే, ఈరోజు టెక్నాలజీ సాయంతో వేగంగా స్పందించగలుగుతున్నాం" అని ఆయన తెలిపారు.

వెయ్యి మందిని పంపమని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాను

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,000 విద్యుత్ స్తంభాలు దెబ్బతింటాయని అంచనా వేయగా, ఒక్క కోనసీమలోనే 8,000 స్తంభాలు నేలకూలాయని చంద్రబాబు తెలిపారు.

"తుపాను తీరం దాటిన వెంటనే చెట్లను తొలగించే పనులు ప్రారంభించాం. ఈరోజు మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు క్లియర్ చేశాం. విద్యుత్ పునరుద్ధరణే ఇప్పుడు మా ముందున్న ప్రధాన సవాలు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి 1000 మంది సిబ్బందిని పంపమని కోరాను. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అదనపు సిబ్బందిని తెప్పిస్తాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికి 100% విద్యుత్ ఇచ్చే బాధ్యత తీసుకుంటాం" అని ఆయన హామీ ఇచ్చారు. టెలికమ్యూనికేషన్ సిగ్నల్స్‌కు అంతరాయం కలగకుండా జనరేటర్లు, డీజిల్ సిద్ధం చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించినా, కొందరు నిర్లక్ష్యం చేశారని, వారికి అవసరమైతే ప్రభుత్వమే డీజిల్ ఖర్చులు భరిస్తుందని చెప్పామని అన్నారు.

నష్టపరిహారంపై స్పష్టమైన హామీ

తుపాను వల్ల ప్రాథమికంగా రూ. 4,600 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. "కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడాను. ఆయన స్వయంగా ఫోన్ చేసి శుక్రవారం కేంద్ర బృందాన్ని పంపిస్తానని చెప్పారు. ప్రాథమిక నష్టాల నివేదికను కేంద్రానికి పంపాం. కేంద్ర బృందం పర్యటన తర్వాత పూర్తిస్థాయి నివేదిక అందించి సహాయం కోరతాం" అని తెలిపారు.

బాధితులకు అందించే పరిహారంపై స్పష్టత ఇస్తూ, "కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్టుకు రూ. 1,500 చొప్పున పరిహారం అందిస్తాం. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసరాలతో కూడిన ప్యాకేజీతో పాటు కొంత నగదు కూడా అందిస్తాం. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టం జరగకుండా ఆదుకుంటాం. ఈసారి పంటలకు బీమా కూడా చేయించాం కాబట్టి దిగుబడి తగ్గినా పరిహారం అందుతుంది" అని భరోసా ఇచ్చారు.

విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, ఎన్నికలకు, సహాయక చర్యలకు సంబంధం లేదని, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోవడం తన బాధ్యత అని అన్నారు. గత 'మొంథా' తుపాను పరిహారంపై మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిందని, ఈసారి కూడా పక్కాగా అంచనాలు వేసి త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో తుఫానులను తట్టుకునేలా కోస్తా తీరంలోని కీలక ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసే ఆలోచన ఉందని చంద్రబాబు వెల్లడించారు.

అమెరికా ఒప్పందంతో భారత్‌కు లాభదాయకమే..

అమెరికాతో ప్రతిపాదిత తొలి దశ వాణిజ్య ఒప్పందంపై రైతు సంఘాల్లో నెలకొన్న ఆందోళనలను కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కొట్టిపారేశారు. ఈ ఒప్పందం వల్ల భారత రైతులు లేదా ఇతర వర్గాల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగదని ఆయన గురువారం స్పష్టమైన హామీ ఇచ్చారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ ఒప్పందం దేశానికి బలమైన తులనాత్మక ప్రయోజనాన్ని అందిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఒప్పంద వివరాలు బయటకు వచ్చాక దేశ ప్రజలు సంబరాలు చేసుకుంటారు. మన రైతులు లేదా ఇతర భాగస్వాముల ప్రయోజనాల విషయంలో ఒక్క చిన్న అంశంలో కూడా రాజీ పడలేదని నేను ధైర్యంగా ప్రకటించగలను" అని పీయూష్ గోయల్ అన్నారు.

ఒప్పందం నేపథ్యం ఏమిటి?

2026 ఫిబ్రవరిలో భారత్, అమెరికా ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఒక ప్రాథమిక ఫ్రేమ్‌వర్క్‌ను ఆవిష్కరించాయి. దీని ప్రకారం, చాలా భారతీయ వస్తువులపై అమెరికా దిగుమతి సుంకాలను తగ్గిస్తుంది. కొన్ని సందర్భాల్లో 50 శాతం వరకు ఉన్న సుంకాలు కూడా తగ్గనున్నాయి. ప్రతిగా, భారత్ కూడా అమెరికాకు చెందిన కొన్ని పారిశ్రామిక వస్తువులతో పాటు బాదం, వాల్‌నట్స్, పండ్లు, కూరగాయలు, వైన్ వంటి వ్యవసాయ ఉత్పత్తులపై ఉన్న అడ్డంకులను, సుంకాలను తగ్గించడానికి అంగీకరించింది. అయితే, ఈ ఒప్పందంపై పూర్తి వివరాలు ఇంకా ఖరారు కావాల్సి ఉంది.

రైతు సంఘాల ఆందోళన ఎందుకు?

ఈ ఒప్పందంపై సంయుక్త్ కిసాన్ మోర్చా వంటి రైతు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మొక్కజొన్న, బాదం, యాపిల్స్, సోయాబీన్ ఆయిల్ వంటి అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం వల్ల, అక్కడి సబ్సిడీలతో కూడిన చౌక దిగుమతులు దేశీయ మార్కెట్లను ముంచెత్తుతాయని వారు భయపడుతున్నారు. దీనివల్ల స్థానిక రైతులకు గిట్టుబాటు ధరలు పడిపోయి, వారి ఆదాయం దెబ్బతింటుందని ఆరోపిస్తున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలోనే పీయూష్ గోయల్ పై వ్యాఖ్యలు చేశారు. సున్నితమైన వ్యవసాయ రంగాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, ఒప్పందం వివరాలు వెల్లడయ్యాక అందరికీ దీనిపై స్పష్టత వస్తుందని ఆయన వివరించారు.

తిరుమలలో నీటి కొరత లేదు

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక భరోసా ఇచ్చింది. కొండపై రానున్న 150 రోజుల వరకు తాగునీటికి ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేసింది. వర్షాలు ఆలస్యమైనప్పటికీ, భక్తులకు నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠమైన ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

గురువారం ఆయన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తిరుమలకు నీటిని సరఫరా చేసే ప్రధాన జలాశయాలను పరిశీలించారు. గోగర్భం, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యామ్‌లలో నీటి నిల్వలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ, "ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సుమారు 150 రోజులకు సరిపోతాయి. ఒకవేళ వర్షాలు ఆలస్యమైనా నీటి కొరత రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం" అని వివరించారు.

ఇటీవల ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఛైర్మన్ వెల్లడించారు. వర్షాలు సకాలంలో కురుస్తాయని, నీటి సమస్య ఉండదనే విశ్వాసాన్ని సీఎం వ్యక్తం చేశారని నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కల్యాణి డ్యామ్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా నీటి సరఫరాను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తిరుమలలో నీటి భద్రతకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇందులో భాగంగా డ్యామ్‌లలో పూడికతీత (డ్రెడ్జింగ్), చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నీటి లీకేజీల నివారణ, నీటి సరఫరా వ్యవస్థ ఆటోమేషన్ వంటి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. లక్షలాది మంది శ్రీవారి భక్తులకు నిరంతరాయంగా, స్వచ్ఛమైన నీటిని అందించడమే తమ బాధ్యత అని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు.

పార్లమెంట్ రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు పెట్టండి

- మొదటి పేజి తరువాయి

చోట కూడా విజయం సాధించలేదు. దీంతో ప్రధాని మోదీ కాంగ్రెస్?ను విమర్శించారు. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తోన్న కాంగ్రెస్ బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్ని స్థానాలు గెలించిందని సెటైర్ వేశారు. ఈ క్రమంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలకు ఖర్గే కౌంటర్ ఇచ్చారు. గురువారం (అక్టోబర్ 29) బెంగళూర్?లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో బ్యాలెట్ పేపర్లు ఉన్న కాలంలోనే బీజేపీ కేవలం రెండు పార్లమెంటు స్థానాలను మాత్రమే గెలుచుకుందని గుర్తు చేశారు.

చిన్నపాటి విజయాలతో బీజేపీకి అహంకారం తగదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి పాలైనంతా మాత్రాన బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని తమ డిమాండ్ వదులుకోబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికలను బ్యాలెట్ పత్రాలనే నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలిచినంత మాత్రాన బీజేపీ ఈసీని మేనేజ్ చేయడంలేదని అర్థం కాదన్నారు. బ్యాలెట్ ఎన్నికలపై బీజేపీకి అంత నమ్మకం ఉంటే తక్షణమే పార్లమెంట్?ను రద్దు చేసి దేశవ్యాప్తంగా బ్యాలెట్ పేపర్లతో సాధారణ ఎన్నికల నిర్వహించాలని ఖర్గే సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం దేశంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పేరిట అక్రమాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పేదలు, మైనారిటీల ఓట్లను తొలగిస్తున్నారన్నారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన ర్యాలీ కూడా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై డ్రోన్ దాడి.. 13 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

వెళ్తున్న రైలు.. దినిప్రో స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉండగా ఈ డ్రోన్ దాడి చోటుచేసుకుంది. ఆ సమయంలో అక్కడ విపరీతమైన రద్దీ ఉంది. ఎయిర్ సైరన్లు మోగినా.. దాడి గురించి హెచ్చరించినా ప్రయాణికులు పట్టించుకోలేదని, దీంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉందని స్థానిక అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 13 మంది మరణించగా.. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. భద్రతా సిబ్బంది తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ రష్యా (=బంంఖు)పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రష్యా సంపన్నులు, ఆ దేశ ఇంధన రంగంపై పశ్చిమ దేశాలు ఆంక్షలు ఎత్తివేయగానే.. మాస్కో తమపై తీవ్రంగా విరుచుకుపడుతోందని ఆరోపించారు. ఇకనైనా ఆ దేశంపై మళ్లీ కఠిన ఆంక్షలు తీసుకొచ్చి.. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని నిలువరించాలని ఈయూ, అమెరికా, జీ7 కూటమిని కోరారు.

అర్నబ్ తుపాను అనంతర చర్యలు.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్!

- మొదటి పేజి తరువాయి

ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పర్యావరణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటాయి. అదేవిధంగా, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక వాటర్ టెస్టింగ్ బృందాలను కూడా రంగంలోకి దించారు. నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా నివారించడం, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంపై ఈ బృందాలు దృష్టి సారిస్తాయి.

ఏపీ సీఎం చంద్రబాబును అభినందిస్తున్నా

- మొదటి పేజి తరువాయి

వల్లే ఏపీలో కరవు, క్రాప్‌హాలిడే లేవు. ఈ విషయంలో చంద్రబాబును అభినందిస్తున్నా" అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణలో లోటు వర్షపాతం 17 నుంచి 20 శాతం మాత్రమే ఉందని, సీఎం రేవంత్ వల్లే రాష్ట్రంలో కరవు వచ్చిందన్నారు. "కరవుపై రేవంత్‌రెడ్డి అవాస్తవాలు చెబుతున్నారు. తీవ్రమైన కరవులో ఉన్నామని చెబుతూనే.. మూసీ సుందరీకరణ ఎందుకు? మూసీ పేరుతో రూ.1.50 లక్షల కోట్ల లూటీకి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఏం జరుగుతుందో రాహుల్ గాంధీకి ఏమైనా తెలుస్తోందా. రాష్ట్రం ఓవైపు కరవుతో అల్లాడుతుంటే.. మూసీ సుందరీకరణ చేపడుతున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

ఇంకా క్షమాపణలు చెప్పేవాళ్లు చాలా మంది ఉన్నారు

మాజీ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు ఇంకా చూడలేదని, చూశాక లీగల్ టీమ్‌తో చర్చిస్తానని చెప్పారు. నిజం నిలకడ మీద తేలుతుందని పెద్దలు ఎప్పుడో చెప్పారు.. ఇంకా క్షమాపణలు చెప్పేవాళ్లు చాలా మంది ఉన్నారని కేటీఆర్ వ్యాఖ్యనించారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ దూది పింజల్లా తేలిపోతాయన్నారు.

ఇంట్లో పాతిపెట్టిన డ్రమ్ముల్లో.. రూ.కోట్ల విలువైన నోట్ల కట్టలు

- మొదటి పేజి తరువాయి

ఉండవచ్చని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఇందుకోసం అసిస్టెంట్ డీసీపీ నేతృత్వంలో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. ముందస్తుగా ఆ గ్రామం మొత్తం విద్యుత్‌ను నిలిపివేసి.. ఆ తర్వాత అనుమానిత ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఓ గదిలో అనుమానాస్పద ప్రదేశంలో తవ్వకాలు జరిపారు. అక్కడ మూడు డ్రమ్ములను గుర్తించారు. వాటిలో నోట్ల కట్టలను చూసి సిబ్బంది అవాక్కయ్యారు. దాదాపు ఐదు గంటలపాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. నగదు స్వాధీనం చేసుకొన్న పోలీసులు ఆదాయ పన్ను అధికారులకు సమాచారమిచ్చారు. రాకేశ్ సోదరుడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు అతడి కుటుంబీకులను ప్రశ్నిస్తున్నారు. వారి పండ్లతోటలు, వ్యవసాయ క్షేత్రాల్లోనూ మరిన్ని సోదాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ముందస్తుగా ఆ ప్రాంతంలో భారీ స్థాయిలో బలగాలను మోహరించారు. - ఈటీవీ భారత్

మియాపూర్‌లో 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

- మొదటి పేజి తరువాయి

2003లో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులోప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను ఇవాళ సుప్రీంకోర్టు కొట్టివేసింది. 550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమి పరిరక్షణకు చూపిన ప్రత్యేక చొరవను కోర్టు అభినందించింది. వాస్తవానికి మియాపూర్ భూములకు సంబంధించి, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ తీసుకున్న నిర్ణయాన్ని 2003లోనే ఉమ్మడి హైకోర్టు సమర్థించింది. ఈ భూములను జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నిషా ఇతరుల నుంచి చట్టబద్ధంగా పొందామని, తమ '×తీతీవజశీఋ్ఎశ్రీవ ఱూూ', 'సనద్' హక్కులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని పార్ధసారధి, సువిశాల్ జైన్‌లు కోర్టును అభ్యర్థించారు. రిజిస్టర్డ్ పత్రాలను రద్దు చేసే అధికారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు లేదని కోర్టులో వాదించారు. ఈవాదనలపై ప్రభుత్వ న్యాయవాదులు కూడా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. జాగీర్దార్ కైసరుద్దీన్‌కు అప్పట్లోనే పరిహారం చెల్లించినందున ఈ భూములపై ఎలాంటి హక్కులను క్లెయిమ్ చేసే అవకాశం వారసులుగా చెబుతున్న వారికి లేదని స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేలా అనుమతించబోమని, ఇలాంటి విషయాల్లో కోర్టు మౌనంగా ఉండలేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

పద్మనాభం మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

రేవిడి పంచాయతీ వెంకటాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఎంపీపీ, జడ్పీటీసీ అభ్యర్థులు

పెన్ పవర్ న్యూస్ -- పద్మనాభం:పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ అభ్యర్థి శ్రీమతి గజపతిరాజు ఉదయకుమారి, జడ్పీటీసీ అభ్యర్థి శ్రీమతి కోరాడ మంజు భార్గవి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ ప్రచారం సాగించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థులు ప్రజలను కోరారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం ద్వారా ఓటర్లను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు.వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో

పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ముందుకు సాగారు.కావాలంటే ఇదే వార్తను మరింత ఆకర్షణీయమైన హెడ్డింగ్‌తో, పత్రికలో ప్రచురించే స్థాయిలో కూడా తయారు చేస్తాను.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

త్వరలోనే ప్రధాన సమస్యల పరిష్కారమే ధ్యేయం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

- దంపింగ్ యార్డు తరలింపునకు పటిష్ట చర్యలు
- తాగునీటి ఎద్దడి నివారణే ప్రథమ ప్రాధాన్యం
- కాలుష్య రహిత పరిశ్రమలకే అనుమతి
- 96వ వార్డులో అడుగడుగునా జననీరాజనం

గాజువాక: పెన్ పవర్,అక్టోబర్ 29 :ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జీవీఎంసీ 96వ వార్డు కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి గంధం శ్రీనివాసరావుకు మద్దతుగా నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో వార్డు ప్రజలు, ముఖ్యంగా మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి అడుగడుగునా ఘన నీరాజనం పలికారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు: స్థానికులకు తీవ్ర అసౌకర్యంగా మారిన డంపింగ్ యార్డును త్వరితగతిన అనువైన ప్రాంతానికి తరలించేందుకు కృషి చేస్తామన్నారు.తాగునీటి సమస్య: వార్డు పరిధిలోని ప్రతి ఇంటికీ నిరంతర, నాణ్యమైన తాగునీరు అందేలా పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.కాలుష్య నియంత్రణ: ప్రజారోగ్యానికి హాని కలిగించే కర్మాగారాలను ఉపేక్షించబోమని, కేవలం కాలుష్య రహిత కంపెనీలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.వార్డు సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న తమ అభ్యర్థి గంధం శ్రీనివాసరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రహరీ గోడ నేలమట్టం నష్టంపై జిల్లా కలెక్టర్ నిశాంతి టి పరిశీలన

పెన్ పవర్ 24 NEWS

పాడేరు గురుకుల పాఠశాల ప్రహరీ గోడ నేలమట్టం

- బిక్కు బిక్కు మంటున్న బాలికలు

పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 28 అర్నబ్ తుపాను ప్రభావం వల్ల అల్లూరి జిల్లా వ్యాప్తంగా బారి నుండి అతి భారీ వర్షాలు కురియడంతో జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వంతెనలు కొట్టుకొని పోయాయి, ఇండ్లు నేలమట్టం అయింది.రోడ్లు ధ్వంసం అయ్యాయి, కొన్ని చోట్ల చేతికి అంది వచ్చిన పంట పొలాలు ముంపునకు గురవ్వడంతో రైతులు నష్టపోయారు.అలాగే అర్నబ్ తుపాను ప్రభావం వల్ల అల్లూరి జిల్లా కేంద్రం లో గల ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాల ప్రహరీ గోడ నేలమట్టం అయింది. కుమ్మరిపుట్ వైపు ఉన్న ప్రహరీ గోడ సుమారు 30 అడుగుల మేరకు పూర్తిగా నేలమట్టం కావడంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎటువైపు నుంచి అకతాయిలు వస్తారో నాని భయాందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థినిల ఆందోళన దృశ్య కనీసం ఐటీడీఏ అధికార్లు గాని, సంబంధిత పాఠశాల ప్రిన్సిపల్ గాని ప్రత్యామ్నాయ పద్ధతిలో ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడం తో విద్యార్థినిలా తల్లిదండ్రులు వక్షిళ్లామండిపడుతున్నారు. గతంలో ఇటువైపు ప్రహరీ గోడ నేలమట్టం కావడంతో అప్పట్లో ఇదే పాఠశాలలో అకతాయిలు దౌరజన్య సంఘటనలు అనేకం. మళ్ళీ అటువైపే ప్రహరీ గోడ నేలమట్టం కావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. తుపాను ప్రభావం కారణంగా సెక్యూరిటీ గార్డులు కూడా ఆ ప్రాంతానికి రాత్రి వేళ కపాల కాసే పరిస్థితి లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి త్వరగా ప్రత్యామ్నాయంగా వెదురు తో నైనా తాత్కాలిక దడి అయిన పట్టాలని విద్యార్థినిలా తల్లిదండ్రులు ఉన్నత స్థాయి అధికార్లకు కోరారు.

epaper.penpower.in | 2026-10-29 | Page: 4
For more details, visit epaper.penpower.in

పెన్ పవర్ కథనానికి స్పందన

పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 29 :అర్నాబ్ తుపాను ప్రభావం వల్ల జిల్లా కేంద్రం కుమ్మరిపుట్ లో గల ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రహరీ గోడ నేలమట్టం అనే శీర్షికతో బుధవారం పెన్ పవర్ దిన పత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి జిల్లా కలెక్టర్ నిశాంతి టి స్పందించారు. గురువారం గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ప్రహరీ గోడ నేలమట్టం అయిన ప్రాంతాన్ని సందర్శించారు. తుఫాను మరియు భారీ వర్షాల కారణంగా పాఠశాల భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు.పాఠశాల ప్రాంగణంలోని పరిస్థితులను సమీక్షించి, విద్యార్థులు, సిబ్బంది భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు.పాఠశాల భవనాలు, తరగతి గదులు, ఇతర సదుపాయాల పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి, దెబ్బతిన్న ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వారిని ఆదేశాలు జారీ చేశారు.విద్యార్థులు, సిబ్బందికి ఎటువంటి ప్రమాదం కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పాఠశాల ప్రాంగణంలో భద్రతా ప్రమాణాలను నిర్ధారించిన తరువాతే సంబంధిత కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలని సూచించారు. విద్యాసంస్థల్లో నష్టాల అంచనా వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికార్లకు ఆదేశించారు.

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు వీఐఐటీ విద్యార్థుల ఎంపిక

కూర్మన్న పాలెం పెన్ పవర్,అక్టోబర్ 29 దువ్వాడ విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అటానమస్ విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ కనబరిచి, దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ గురజాడ, విజయనగరం టేబుల్ టెన్నిస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు వీరు ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పోటీలకు ఎంపికైన వారిలో బీటెక్ డేటా సైన్స్ నాలుగో సంవత్సరం విద్యార్థిని ఎస్. జస్మిత, బీటెక్ కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం విద్యార్థిని వి. యువశ్రీ ఉన్నారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ రెండో సంవత్సరం విద్యార్థిని పూజిత స్టాండ్‌బై క్రీడాకారిణిగా ఎంపికైందని తెలిపారు పోటీలు 2026 డిసెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జేఎన్‌టీయూ–జీవీ టేబుల్ టెన్నిస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్, రెక్టార్ డాక్టర్ వి. మధుసూధన రావు విద్యార్థులను అభినందించారు. క్రీడల పట్ల వారు చూపుతున్న అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలను ప్రశంసించారు. రాబోయే పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.వీఐఐటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ బృందం ఇన్‌చార్జి డాక్టర్ పి.ఎస్.వి. రమణ, చి. రాంబాబు, డాక్టర్ జె. ప్రశాంత్, జి. వంశీకృష్ణ, జె. దుర్గ విద్యార్థులను అభినందించారు. వారి కృషి, సాధనను ప్రశంసిస్తూ, రాబోయే పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం అందిస్తూ, వారిలో జట్టుగా పనిచేసే నైపుణ్యం, క్రమశిక్షణ, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు వీఐఐటీ నిరంతరం కృషి చేస్తోంది.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా -మాడిశ కనకరాజు

కూర్మన్న పాలెం:పెన్ పవర్,అక్టోబర్ 29 :జీవీఎంసీ ఎన్నికల్లో 101 వ వార్డు నుండి తనను గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని వార్డు కూటమి కార్పొరేటర్ అభ్యర్థి మాడిశ కనకరాజు తెలిపారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక వార్డు మంగళపాలెం, దువ్వాడ లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ వార్డులో పలు సమస్యలు ప్రజలు తన దృష్టికి తీసుకువస్తున్నారని ముఖ్యంగా మురుగునీరు కాలువలు, రహదారులు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యువతకు క్రీడా మైదానాలు ఏర్పాటు, కల్యాణ మండపాలా నిర్మాణం కోసం ప్రజలు వివరించారాని తెలిపారు . ప్రభుత్వ సహకారంతో వార్డుని అభివృద్ధి చేసేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.వార్డు ప్రజలు తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారంపై రాజీ లేకుండా పని చేస్తానని తెలిపారు.

టీడీపీతో ఎన్టీఆర్ కాలం నుంచి అనుబంధం పార్టీకి విధేయుడినే

- **తుంగ్లాం గ్రామ అభివృద్ధికి అధిక నిధులు తీసుకొచ్చా- ప్రజల మద్దతుతో 85వ వార్డులో విజయం సాధిస్తాం**
- **సస్పెన్షన్ హెచ్చరికలపై కాకి గోవిందరెడ్డి వివరణ**

కూర్మన్న పాలెం : పెన్ పవర్ ,అక్టోబర్ 29 స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు తెలిపే వారిపై సస్పెన్షన్ చర్యలు తీసుకుంటామని తెలుగుదేశం పార్టీ నాయకత్వం హెచ్చరించిన నేపథ్యంలో, 85వ వార్డు స్వతంత్ర అభ్యర్థి కాకి గోవిందరెడ్డి తన రాజకీయ ప్రస్థానం, పార్టీతో ఉన్న అనుబంధం, వార్డు అభివృద్ధికి చేసిన కృషి గురించి వివరించారు.

ఎన్టీఆర్ కాలం నుంచి తాను తెలుగుదేశం పార్టీతో అనుబంధం కలిగి ఉన్నానని, విద్యార్థి దశ నుంచే పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నానని గోవిందరెడ్డి తెలిపారు. పార్టీ పట్ల తనకు ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయని, ఇప్పటికీ తాను టీడీపీ కార్యకర్తగానే గర్వపడుతున్నానని పేర్కొన్నారు.పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వహించానని, బీసీ ఛైర్మన్ పదవితో పాటు కార్పొరేటర్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌ల నాయకత్వం పట్ల తనకు గౌరవం ఉందన్నారు. తనతో పాటు తన భార్య కూడా కార్పొరేటర్‌గా ఎన్నికై ప్రజలకు సేవ చేసే అవకాశం పొందారని గుర్తుచేశారు.పార్టీలో తాను ముగ్గురు సభ్యుల కమిటీలో, అనంతరం ఐదుగురు సభ్యుల కమిటీలో పనిచేశానని గోవిందరెడ్డి తెలిపారు. ఐదుగురు సభ్యుల కమిటీలో ఉన్న సమయంలో పల్లా శ్రీనివాసరావుకు మద్దతుగా నిలిచామని, ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యేందుకు తమ సహకారం కూడా ఉందని పేర్కొన్నారు. అనంతరం తనకు ఫ్లోర్ లీడర్ బాధ్యతలు లభించాయని చెప్పారు.తన గురించి పార్టీ నాయకత్వానికి తప్పుడు సమాచారం చేరిందని ఆరోపించారు. 69వ వార్డు కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో వార్డు అభివృద్ధికి అధికారుల నుంచి ఆశించిన సహకారం అందలేదని, తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. మేయర్ ఎన్నికల సమయంలో పార్టీ సూచన మేరకు టీడీపీకి ఓటు వేసినప్పటికీ, తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.తాను ప్రాతినిధ్యం వహించిన ప్రాంతంలో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చానని గోవిందరెడ్డి తెలిపారు. ముఖ్యంగా తుంగ్లాం గ్రామానికి జీవీఎంసీ పరిధిలో అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. తన రాజకీయ జీవితం, వ్యక్తిత్వం, ప్రజలతో ఉన్న సంబంధాలు అందరికీ తెలుసని, తన సేవలను ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు.పార్టీతో తనకున్న దీర్ఘకాల అనుబంధాన్ని గుర్తించాలని కోరుతూ, తనపై వచ్చిన ఆరోపణలు, సస్పెన్షన్ హెచ్చరికల నేపథ్యంలో తన వైఖరిని ప్రజలకు వివరించేందుకే ఈ సమావేశం నిర్వహించినట్లు గోవిందరెడ్డి తెలిపారు. 85వ వార్డులో ప్రజల మద్దతుతో పోటీ చేస్తున్నామని, ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తామనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.నేను తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తిని కావడం గర్వంగా భావిస్తున్నాను. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీతో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం. నా అభివృద్ధి పనులను, నా వ్యక్తిత్వాన్ని ప్రజలే నిర్ణయిస్తారు" అని కాకి గోవిందరెడ్డి స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ విప్.

గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 29 పెన్ పవర్.కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలో గల పి.ఆమిటి,మండ గ్రామాల్లో గురువారం నాడు ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం జడ్పీటీసీ అభ్యర్థి పాలక క్రాంతికుమార్,పి.ఆమిటి ఎంపీటీసీ సెగ్మెంట్ అభ్యర్థి మూటక జగదీశ్వరరావుల విజయాన్ని కాంక్షిస్తూ ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి,వారి విజయానికి సహకరించాలని ఓటర్లను కోరారు.పి.ఆమిటి ఎంపీటీసీ సెగ్మెంట్‌తో పాటు గుమ్మలక్ష్మీపురం మండల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ,స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఓటర్ల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగేందుకు స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని తెలిపారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మండల కూటమి నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ నిషాంతి టి.

పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 29 :అల్లూరి సీతారామరాజు జిల్లాలో తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న సహాయక చర్యలను జిల్లా కలెక్టర్ నిషాంతి టి. గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు, పారిశుధ్య నిర్వహణ, వంతెన భద్రత, విద్యాసంస్థల్లో తుఫాను కారణంగా జరిగిన నష్టాన్ని ఆమె సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, ప్రజల అవసరాలకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జీసీసీ గోడౌన్ వద్ద విద్యుత్ పునరుద్ధరణ పనుల పరిశీలన పాడేరులోని జీసీసీ గోడౌన్ వద్ద జరుగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భారీ వర్షాలు, తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు ఏర్పడిన అంతరాయాలను తొలగించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, ఇతర విద్యుత్ వ్యవస్థల మరమ్మతులను వేగవంతం చేసి, ప్రజలకు సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ సమయంలో సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాడేరు పాత బస్టాండ్‌లో పారిశుధ్య పనుల పరిశీలన

అనంతరం పాడేరు పాత బస్టాండ్‌లో పారిశుధ్య పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో బస్టాండ్ పరిసరాల్లో పరిశుభ్రత, మురుగునీటి పారుదల, నీరు నిల్వ ఉండకుండా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ప్రయాణికులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే

తలారసింగి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో తుఫాను నష్టంపై పరిశీలన తలారసింగిలోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి, తుఫాను మరియు భారీ వర్షాల కారణంగా పాఠశాల భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలోని పరిస్థితులను సమీక్షించి, విద్యార్థులు, సిబ్బంది భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. పాఠశాల భవనాలు, తరగతి గదులు, ఇతర సదుపాయాల పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి, దెబ్బతిన్న ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బందికి ఎటువంటి ప్రమాదం కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పాఠశాల ప్రాంగణంలో భద్రతా ప్రమాణాలను నిర్ధారించిన తరువాతే సంబంధిత కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలని తెలిపారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యత తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారులు మరియు వంతెనల భద్రత, పారిశుధ్య నిర్వహణ, విద్యాసంస్థల్లో నష్టాల అంచనా వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు తక్షణమే అందేలా చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అర్నాబ్ తుపాను బీభత్సానికి పాడేరు అతలాకుతలం

పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 29:అర్నాబ్ తుపాను ప్రభావం బీభత్సానికి పాడేరు మండల కేంద్రం అతలాకుతలం అయిపోయింది. బుధవారం ఉదయం నుంచి తెల్లారుజాము వరకు అతి భారీ వర్షం గాలి వాన బీభత్సానికి సాయి బాబా గుడి దగ్గర రెండు వృక్షాలు, గొందూరు సెంటెన్స్ పాఠశాల సమీపంలో ఒక పెద్ద వృక్షం, ఆర్ టి సి కాంప్లెక్స్ సమీపంలో ఒక కొమ్మ కరెంట్ స్తంభాలపై విరిగి పడడంతో బారీగా కరెంట్ స్తంభాలు విరిగి పోయింది. దీంతో పాడేరు పట్టణమంతా చీకటి మాయంగా అయిపోయింది. గురువారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా స్తంభించి పోయింది. విద్యుత్ శాఖ అధికార్లు చొరవ తీసుకుని శరవేగంగా యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకోవడం తో ఎట్టకేలకు గురువారం సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరా జరిగింది. కాగా మొదకొండమ్మ అమ్మ వారి ఘాట్ లో కొండ చర్యలు విరిగి పడడంతో వాహన రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు శాఖ, రెవిన్యూ అధికారులు శ్రమించి విరిగి పడ్డ కొండ చర్యలను జె సి బి ల సహాయంతో తొలగించడంతో వాహన రాకపోకలు జరిగింది.. బుధవారం రాత్రి నుంచి అటు గరికిబంద పోలీస్ చెక్ పోస్టు లో ఇటు తుంపద చెక్ పోస్టు లో వాహనాలు నిలిపి వేయడంతో ఎటువంటి ప్రసాదాలు తో పాటు ప్రాణ నష్టం జరగలేదు దీంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ప్రచార వాహనాల అనుమతులు మండల తహశీల్దార్ వద్దనే

* పాడేరు సబ్ కలెక్టర్ కె. సాహిత్

పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 29 : వచ్చే నెల నవంబర్ 5వ తేదీలో జరగనున్న 2వ విడత స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోటీ చేస్తున్న జడ్పీటీసీ , ఎంపీటీసీ అభ్యర్థులు తమ ప్రచారం నిమిత్తం వినియోగించే వాహనాల ముందస్తు అనుమతులను ఇకపై నేరుగా సంబంధిత మండల తహశీల్దార్ కార్యాలయం నుంచే పొందవచ్చని సబ్ కలెక్టర్ కె. సాహిత్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి,? నిషాంతి. టి ఆదేశాలు మేరకు పోటీలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు జిల్లాలోని 11 మండలాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చి సబ్ కలెక్టర్ వారి నుండి అభ్యర్థులు ప్రచార వాహనల పరిమిషన్ ఇప్పటి వరకు తీసుకుంటున్న సంగతి అందరికీ తెలిసినదే, వారు సూదిరా ప్రాంతాల, మండలాల నుండి రావాటినికి సమయం వృధా అవకుండా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు సమయాన్ని ఆదా చేసుకోవడానికి, అనుమతుల ప్రక్రియ సులభతరం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ మేరకు ప్రచారం వాహనాల అనుమతులు మండల్ తహశీల్దార్ పరిమిషన్ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని, అనుమతి లేని వాహనాల్లో ప్రచారం చేస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల పోటీలో ఉన్న ?అభ్యర్థులందరూ ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించి సహకరించాలని సబ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నాలుగు పంచాయతీల్లో వైఎస్సార్సీపీ నేతల ప్రచారం

గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 29:స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దారకొండ, గుమ్మిరేవులు, దుప్పలవాడ, సీలేరు పంచాయతీల పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుందరి రామకృష్ణ, కంకిపాటి నారాయణ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలను కలుసుకుని పార్టీ బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థులు, జడ్పీటీసీ అభ్యర్థి కంకిపాటి గిరిప్రసాద్‌కు మద్దతు కోరారు.ప్రచారంలో భాగంగా గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కుందరి రామకృష్ణ ప్రస్తావించారు. గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు, స్థానిక వనరుల పరిరక్షణ, గ్రామాల అభివృద్ధి వంటి అంశాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీలకు చెందిన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చిరాజుపాలెంలో తొలగని దుర్గాదేవి నవరాత్రి పందిరి!

* పండుగ ముగిసినా రోడ్డుపై పందిరి అలాగే!
* స్థానిక ప్రజలకు తప్పని ఇబ్బందులు!
* ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ స్థానికుల ఆవేదన!
* సంబంధిత అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 29 : విశాఖ పశ్చిమలోని బుచ్చిరాజుపాలెం ప్రాంతంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పందిరిని ఉత్సవాలు ముగిసినప్పటికీ ఇప్పటివరకు తొలగించకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కన ఏర్పాటు చేసిన పందిరి కారణంగా నిత్య రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు.సాధారణంగా రహదారుల పక్కన మతపరమైన, సాంస్కృతిక కార్యక్రమాల కోసం తాత్కాలిక పందిర్లు ఏర్పాటు చేయాలంటే సంబంధిత అధికారుల అనుమతులు, పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాల్సి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, ఉత్సవాలు పూర్తయిన వెంటనే తాత్కాలిక నిర్మాణాలను తొలగించి రహదారిని యథావిధిగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అయితే బుచ్చిరాజుపాలెంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల కోసం ఏర్పాటు చేసిన పందిరి ఇంకా అలాగే ఉండటంతో ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు అంటున్నారు. నిత్యం రాకపోకలు సాగించే వారు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్వాహకులు గుర్తించి పందిరిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పందిరిని ఎందుకు తొలగించడం లేదని, ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ఎవరైనా ప్రశ్నిస్తే నిర్వాహకులు భయభ్రాంతులకు గురిచేసే విధంగా మాట్లాడుతున్నారంటూ కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యను ప్రస్తావించినందుకు ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, స్థానికులు తమ సమస్యలను ప్రశాంతంగా వ్యక్తం చేసే పరిస్థితి ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. రహదారుల పక్కన తాత్కాలిక పందిర్లు ఏర్పాటు చేసే సందర్భంలో అనుమతుల నిబంధనలు, ప్రజా రాకపోకలకు ఆటంకం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నది సంబంధిత అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఉత్సవాలు ముగిసిన తరువాత కూడా పందిరి కొనసాగడానికి అనుమతి ఉందా? ఉంటే దానికి సంబంధించిన నిబంధనలు ఏమిటి? ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న పరిస్థితిని నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బుచ్చిరాజుపాలెంలో నెలకొన్న ఈ సమస్యపై పోలీసు శాఖతోపాటు సంబంధిత మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పందిరి కొనసాగుతున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దాన్ని తొలగించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మతపరమైన కార్యక్రమాల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రజా రహదారుల వినియోగం, స్థానికుల సౌకర్యాలు కూడా అంతే ముఖ్యమని వారు పేర్కొంటున్నారు. అధికారులు సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బుచ్చిరాజుపాలెం ప్రాంతవాసులు కోరుతున్నారు.

జీవీఎంసీలోనూ కూటమి జెండా ఎగరాలి!

* పశ్చిమలో నాలుగు భారీ బహిరంగ సభలతో గణబాబు ఎన్నికల శంఖారావం
* సైకిల్ గుర్తుపై ఓటేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలి
* వార్డుల సమగ్రాభివృద్ధికి కూటమి పాలన అవసరమన్న ప్రభుత్వ విప్

విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 29 : జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయ వేడి పెరిగింది. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. నాలుగు ప్రధాన కేంద్రాల్లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జీవీఎంసీలోనూ కూటమి అధికారంలోకి వస్తేనే వార్డుల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని ఆయన పేర్కొంటూ, సైకిల్ గుర్తుపై ఓటేసి కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి, జీవీఎంసీ మేయర్ అభ్యర్థిని డాక్టర్ ముక్కా శ్రావణి, కూటమి యువ నాయకుడు మౌర్య సింహా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతుగా ప్రసంగించారు. నాలుగు ప్రాంతాల్లో నిర్వహించిన సభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బాజీ జంక్షన్‌లో నిర్వహించిన తొలి భారీ బహిరంగ సభలో 69వ వార్డు అభ్యర్థి యలమంచిలి ప్రసాద్, 70వ వార్డు అభ్యర్థిని నరవ అనూష విజయానికి మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం గోపాలపట్నంలో జరిగిన రెండో సభలో 71వ వార్డు అభ్యర్థిని నారిపిన్ని లక్ష్మి సత్తిరాజుకు మద్దతు ప్రకటించారు. చంద్రనగర్‌లో నిర్వహించిన మూడో సభలో 73వ వార్డు అభ్యర్థి పొన్నాడ రమణారావు (పెప్సీ రమణ) గెలుపు కోసం ఓటర్లను అభ్యర్థించారు. పద్మనాభనగర్‌లో జరిగిన నాలుగో సభలో 72వ వార్డు అభ్యర్థి బొడ్డేటి విజయ్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సభల ద్వారా పశ్చిమ నియోజకవర్గంలోని కీలక వార్డుల్లో కూటమి అభ్యర్థుల తరపున ప్రచారాన్ని ఉధృతం చేయడంతో పాటు, మేయర్ అభ్యర్థిని డాక్టర్ ముక్కా శ్రావణి విజయాన్ని కూడా నాయకులు ప్రధానంగా ప్రస్తావించారు.సభల్లో గణబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో పలు కీలక అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. ఎన్ఎస్‌టీఎల్ గోడను తొలగించి హైవేకు అనుసంధానం చేయడం, ఎన్ఎస్‌టీఎల్ నుంచి ఇందిరానగర్ వరకు ప్రధాన రహదారి విస్తరణ చేపట్టి దానికి 'లక్ష్మీ నరసింహ మార్గం'గా నామకరణం చేయడం వంటి పనులను వివరించారు. నగర ప్రజలకు ఎంతోకాలంగా అవసరమైన ఎన్ఏడీ ఫ్లైఓవర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు కాకానినగర్ వద్ద అండర్‌పాస్ పనులు ప్రారంభించామని తెలిపారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం, పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా టిడ్కో ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారులకు వాటి పంపిణీ వంటి అంశాలను ప్రస్తావించారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని గణబాబు విమర్శించారు. స్థానిక సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై వైఎస్సార్సీపీ స్పందనను ఈ ప్రకటనలో ప్రస్తావించలేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని గణబాబు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల తరహాలోనే జీవీఎంసీ పరిధిలోని వార్డులు కూడా మరింత పురోగతి సాధించాలంటే నగరపాలక సంస్థలో కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వార్డుల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. 69వ వార్డులో యలమంచిలి ప్రసాద్, 70వ వార్డులో నరవ అనూష, 71వ వార్డులో నారిపిన్ని లక్ష్మి సత్తిరాజు, 72వ వార్డులో బొడ్డేటి విజయ్ కుమార్, 73వ వార్డులో పొన్నాడ రమణారావు (పెప్సీ రమణ)తో పాటు జీవీఎంసీ మేయర్ అభ్యర్థిని డాక్టర్ ముక్కా శ్రావణిని గెలిపించాలని గణబాబు ప్రజలను కోరారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా వార్డుల అభివృద్ధికి అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సైకిల్ గుర్తుపై ఓటేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఒకే ప్రచార కార్యక్రమంలో నాలుగు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా కూటమి నాయకత్వం ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేసినట్లు కనిపిస్తోంది. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఓటర్లకు గుర్తుచేయడం, ప్రస్తుత ప్రభుత్వ అభివృద్ధి హామీలను వివరించడం, స్థానిక మౌలిక వసతుల సమస్యలను ప్రధానంగా ప్రస్తావించడం ఈ ప్రచారంలో కీలక అంశాలుగా నిలిచాయి. అయితే, సభలకు హాజరైన జనసమీకరణ ఎన్నికల ఫలితాల్లో ఎంతవరకు ఓట్లుగా మారుతుంది? స్థానిక సమస్యల పరిష్కారంపై కూటమి ఇచ్చిన హామీలను ఓటర్లు ఏ మేరకు విశ్వసిస్తారు? అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రజల్లో వారి అందుబాటు, వార్డుల వారీగా ఉన్న స్థానిక రాజకీయ సమీకరణాలు ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయి? అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా, విశాఖ పశ్చిమలో నిర్వహించిన నాలుగు భారీ బహిరంగ సభలు కూటమి ఎన్నికల ప్రచారానికి ఊపునిచ్చే ప్రయత్నంగా నిలిచాయి. అయితే, సభలకు వచ్చిన స్పందన ఓట్ల రూపంలో ఎంతవరకు ప్రతిఫలిస్తుందన్నది ఎన్నికల ఫలితాల అనంతరమే స్పష్టమవుతుంది.

అర్నాబ్ తుఫాన్‌తో రాష్ట్రానికి రూ.4,600 కోట్ల నష్టం

★ నేడు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలు
★ బాధితులకు అండగా ఉంటాం: సీఎం చంద్రబాబు

కాకినాడ/ముమ్మిడివరం, పెన్ పవర్ అక్టోబర్ 29: అర్నాబ్ తుఫాన్ కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని గచ్చకాయలపొర గ్రామంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తుఫాన్ నష్టం, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను వివరించారు. నష్టంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడామని, పరిస్థితులను వివరించామని తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు శుక్రవారం కేంద్ర బృందాలు రాష్ట్రానికి రానున్నట్లు వెల్లడించారు. పూర్తిస్థాయి అంచనా అనంతరం నష్టం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలు తుఫాన్ ప్రభావానికి ఎక్కువగా గురయ్యాయని సీఎం తెలిపారు. కోనసీమలో సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని,విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అవసరమైన సిబ్బందిని తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా రప్పిస్తామని పేర్కొన్నారు.రహదారులపై కూలిన చెట్లను తొలగించడం, టెలికమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించడం,చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించిందన్నారు.తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. నష్టపోయిన కొబ్బరి, ఆయిల్‌పామ్ చెట్లకు ఒక్కొక్కటికి రూ.1,500 చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే వారికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల ప్యాకెట్‌తో పాటు ఖర్చులకు నగదు అందిస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంటల బీమా ద్వారా కూడా రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు.గత తుఫాన్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని సీఎం పేర్కొన్నారు. అయినప్పటికీ దురదృష్టవశాత్తూ ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రకృతి విపత్తులను ఆపలేకపోయినా, సమర్థవంతమైన చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తోందని, తుఫాన్ బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఆర్నబ్ తుఫానుకు ధ్వంసమైన రేకు ఇల్లు.

గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 29 పెన్ పవర్.ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి గుమ్మలక్ష్మీపురం మండలం జర్న పంచాయితీ బబ్బిడి గ్రామంలో రేకిళ్లు పైకప్పు ఎగిరిపోయంది.స్థానికులు తెలిపిన మేరకు బుధవారం నాడు రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి కొండ గౌరి మల్లేష్ రేకింటి పైకప్పు గాలికి కొట్టుకుపోయిందని ప్రమాదవశాత్తు ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అయినప్పటికీ ఇంటి పైకప్పు మాత్రం పూర్తిగా ధ్వంసం అయిందనిస్థానికులు తెలిపారు.కావున అధికారులు స్పందించి మల్లేష్ కు న్యాయం జరిగే విధంగా చూడాలని స్థానికులు కోరారు.

ఎంపీటీసీ అభ్యర్థి మంగమ్మ ఇంటింటికి ప్రచార కార్యక్రమం

జియ్యమ్మ వలస అక్టోబర్ 29 పెన్ పవర్.కురుపాం నియోజకవర్గం,జియ్యమ్మవలస మండలం,గౌరీపురం గ్రామంలో కుదమ సిగ్మెంట్ తెలుగు దేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ,సతీమణి డొంకాడ మంగమ్మ గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ,కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జియ్యమ్మవలస మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు,గ్రామ నాయకులు,కూటమి కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

మైనార్టీ నాయకులపై బురద జల్లడం మానుకోవాలి -షేక్ రెహమాన్

గాజువాక:పెన్ పవర్,అక్టోబర్29 పారిశ్రామిక ప్రాంతం పాత గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెదేపా ముస్లిం మైనారిటీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా నియోజకవర్గం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ తాను వైస్ ప్రెసిడెంట్ గా సేవాలాందిస్తున్న మసీద్ నూర్ ఈ ఇస్లాం మసీద్ కి గ్యారవీ షరీఫ్ పండుగ సందర్బంగా స్థానికంగా వున్న నాయకులు పాల్గొనడం అనవయితీగా వస్తుందని, దానిలో భాగంగానే గత ఆదివారం పండుగనాడు నాయకుల్లో వైకాపా నాయకులు కూడ మసీద్ కు వచ్చారని, వారిని ఎప్పటిలాగే మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆ వైకాపా నాయకుడుని కలిసిన ఫోటో పట్టుకొని కొన్ని మాధ్యమాల్లో తిప్పుతూ బురద జల్లే ప్రక్రియ చేస్తున్నారని ఆరోపించారు. గత 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్నాని, ప్రస్తుతం గాజువాక నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడుగా కొనసాగుతున్న తరుణంలో కిట్టనివాళ్ళు అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు. మతాలు మధ్య చిచ్చు పెట్టె పనులు మానుకోవాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.సమావేశంలో గాజువాక నియోజకవర్గ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు మొహ్మద్ ఆరిఫ్, జాయింట్ సెక్రటరీ షేక్ అబ్దుల్ ఖయ్యుమ్,90వ వార్డు మైనారిటీ అధ్యక్షుడు ఇంతియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన
ఆదివారం, సోమవారం పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు



అమరావతి/కాకినాడ అక్టోబర్ 29 పెన్ పవర్: దక్షిణ అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ సుస్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందన్నారు. శనివారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశముందని వెల్లడించారు. దీని ప్రభావంతో ఆదివారం, సోమవారం కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

నాలుగు రోజుల వర్ష సూచన ఇలా..

శుక్రవారం (అక్టోబర్ 30) అల్లూరి, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఇతర జిల్లాల్లో చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

శనివారం (అక్టోబర్ 31) విజయనగరం, కృష్ణా, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆదివారం (నవంబర్ 1) కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, అల్లూరి, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి.

సోమవారం (నవంబర్ 2) పోలవరం జిల్లాలో భారీ వర్షాలు, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎండీ వివరించారు.

నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల కారణంగా వంశధార, నాగావళి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నదీ పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. పొంగిపొర్లే కాలువలు, వాగులను దాటేందుకు ప్రయత్నించవద్దని, నదుల్లో ఈతకు వెళ్లరాదని హెచ్చరించారు.

పలాసలో అత్యధిక వర్షపాతం

గురువారం సాయంత్రం 5 గంటల నాటికి శ్రీకాకుళం జిల్లా పలాసలో 40.7 మి.మీ., కంచిలిలో 27 మి.మీ., మందసలో 24.5 మి.మీ., ఇచ్ఛాపురంలో 23.7 మి.మీ., పిన్నింటిపేటలో 17 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్ఓ

గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 29 పెన్ పవర్. మండలంలో దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం నాడు డిప్యూటీ డి.ఎమ్ అండ్ హెచ్.ఓ కె.వి.ఎస్ పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వైద్యులకు అందుతున్న సేవల సదుపాయాల గురించి తెలుసుకొన్నారు.ఈ మేరకు డిప్యూటీ డిఎంహెచ్ఓ పద్మావతి మాట్లాడుతూ,వర్షాలు పడిన నేపథ్యంలో వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఏజెన్సీ గిరిజన ప్రాంతం కావడంతో ప్రతి గ్రామాలకు వెళ్లి క్షుణంగా పరిశీలించి వారికి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు.అనంతరం రికార్డులు పరిశీలించి అనుక్షణం పర్యవేక్షణలో ఉండాలని వైద్య సిబ్బందికు సూచించారు.

తుఫాను బాధితులకు సహాయక చర్యలు వేగవంతం చేయాలి

68 చెరువుల వద్ద నిరంతర పర్యవేక్షణ..
విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

రంపచోడవరం (పోలవరం బ్యూరో)పెన్ పవర్, అక్టోబర్ 29: అర్నబ్ తుఫాను ప్రభావంతో జిల్లాలో దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో హెచ్చరిక స్థాయిలో గుర్తించిన 68 చిన్న నీటిపారుదల చెరువుల వద్ద నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణతో పాటు అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పొట్లవాడ వంతెన పరిస్థితిపై సమీక్ష

మారేడుమిల్లి మండలం పొట్లవాడ గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన కొట్టుకుపోయిన నేపథ్యంలో గ్రామానికి రాకపోకలు, ప్రత్యామ్నాయ మార్గాల అందుబాటు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై కలెక్టర్ సమీక్షించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.తుఫాను కారణంగా టెలికాం టవర్లకు ఎదురైన సమస్యలను గుర్తించి, మొబైల్ నెట్‌వర్క్ సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని స్పష్టం చేశారు.

విపత్తు సహాయక సామగ్రి సిద్ధంగా ఉంచాలి

తుఫాను సహాయక చర్యల కోసం ప్రతి మండలానికి కేటాయించిన వర్షపు కోట్లు, టార్చిలైట్లు, చేతితో పట్టుకునే మైకులు, జలనిరోధక పరదాలను తహసీల్దార్లు తమ ఆధీనంలో భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు ఈ సామగ్రి సంరక్షణ బాధ్యతలు అప్పగించి, భవిష్యత్తులో విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించేలా సిద్ధంగా ఉంచాలని సూచించారు.రంపచోడవరం డివిజన్‌లోని మండలాలకు సహాయక సామగ్రి పంపిణీ పూర్తయిందని, చింతూరు డివిజన్‌లోని మండలాలకు మరుసటి రోజు ఉదయం పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

68 చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో మొత్తం 428 చిన్న నీటిపారుదల చెరువులు ఉండగా, గత 48 గంటల వర్షపాతం, తదుపరి 24 గంటల వర్ష సూచన ఆధారంగా 68 చెరువులను హెచ్చరిక స్థాయిలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా చెరువుల వద్ద గ్రామ రెవెన్యూ అధికారులను నియమించి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.సబ్ కలెక్టర్లు వ్యక్తిగతంగా పరిస్థితులను సమీక్షించాలని, నీటిమట్టాలు, చెరువుల కట్టల స్థితిగతులపై నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తుఫాను అనంతర పరిస్థితుల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సహాయక చర్యలు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, నీటిపారుదల వనరుల పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవసరమైన సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు.

కూటమి అభ్యర్థి టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి సోమేలి అఖిలప్రియ ప్రచారం

జి.మాడుగుల.పెన్ పవర్.అక్టోబర్ (29) మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. జి.మాడుగుల జెడ్పీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సోమెలి అఖిలప్రియ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బోయితిలి, భీరం, నుర్మతి, జి.మాడుగుల, బందవీధి, ఎం. నీట్టపుట్టు గ్రామాల్లో పర్యటించి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్ల మద్దతు కూడగడుతున్నారు. మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ నెలకొనడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలవడం, తమకు మద్దతు ఇవ్వాలని కోరడం ద్వారా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. తెదేపా సీనియర్ నాయకుడు సోమెలి చిట్టిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్నబ్ తుఫాన్ ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- ఒమ్మంగి--శరభవరం రహదారి తాత్కాలికంగా మూసివేత.
- ప్రత్తిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం.

కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 29: ఆర్నబ్ తుపాన్ ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం కోరారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఒమ్మంగి–శరభవరం రహదారి పూర్తిగా జలమయమైంది.దీంతో ప్రత్తిపాడు సీఐ, బిఎస్ అప్పారావు ఆదేశాలతో ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీస్ సిబ్బందితో కలిసి ఒమ్మంగి–శరభవరం పరిశీలించి రహదారిని తాత్కాలికంగా మూసివేసినట్లు ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు.రహదారి పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రజలు, వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించవద్దని సూచించారు.ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని, అధికారులు జారీ చేసిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆమె ప్రజలను కోరారు.ప్రత్తిపాడు మండలంలో భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా చెట్లు నేలకొరిగినా, రహదారులకు ఆటంకం ఏర్పడినా 9440796530 ప్రత్తిపాడు సి ఐ,నెంబరకుగాని 9440796570 నెంబరకు గాని సంప్రదించాలని ఎస్సై, లక్ష్మీకాంతం సూచించారు.

జలవలయంలో కిర్లంపూడి మండలం జగపతినగరం.

- ప్రత్తిపాడు కిర్లంపూడి ప్రధాన రహదారిపై సూర్యారామ నుండి అమోఘా వరకు నడుంలోతు నీరు.
- రాకపోకలకు తీవ్ర అంతరాయం.
- డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం, ఆర్నబ్ తుపాన్ ప్రభావంతో భారీగా చేరిన వరద నీరు.
- మంగళవారం మధ్యాహ్నం 12 గంటలనుండి కరెంటు లేక, మంచినీరు లేక ప్రజలు అవస్థలు.
- పట్టించుకోని అధికార యంత్రాంగంపట్ల మండిపడుతున్న ప్రజలు.

కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్,29: ఆర్నబ్ తుపాన్ ప్రభావంతో కుంభవృష్టి వర్షాల కారణంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరంలోని కొత్తపేట,బంక్ వెనుక కాలనీ, శెట్టిబలిజ పేట, సోమరాజుపేట, నర్సయ్య పేట,జగపతినగరంలోని పలు కాలనీలు జలవలయంలో చిక్కుకున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి బుధవారం రాత్రి వరకు కూడా కరెంటు లేకపోవడంతో ప్రజలు త్రీవ అవస్థలు పడుతున్నారు. త్రాగడానికి మంచి నీరు కూడా లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణానాతీతం.ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నప్పటికి అధికార యంత్రాంగం గాని, ప్రజా ప్రతినిధులుగాని పట్టించుకోక పోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు.డ్రైనేజగపతినగరం గ్రామంలో మెయిన్ డ్రైనేజీ వ్యవస్థ అష్టవ్యస్తంగా మారి ప్రతి సంవత్సరం గ్రామంలోని పలు కాలనీలు ముంపుకు గురై రోజుల తరబడి నీటిలో నివాసం ఉండవలసిన వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామని వరద వచ్చినపుడే హామీలు ఇస్తున్నారు తప్ప ఏళ్ల తరబడి ఇంతవరకు చేసింది ఏమీ లేదని ప్రజలు వాపోతున్నారు.ఏ ప్రభుత్వం వచ్చినా లక్షలాది రూపాయలతో సిమెంట్ రోడ్డు మీద సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి స్థానిక నాయకులు ఈజీగా సొమ్ము చేసుకుంటున్నారు తప్ప, డ్రైనేజీ వ్యవస్థ మీద ద్రుష్టి సారించక పోవడంపట్ల ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

పంట పొలాలు పరిశీలించిన అధికారులు

జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 29: మండలంలో సీతానగరం గ్రామంలో ఆర్నబ్ తుఫాను బారిన పడిన వరి పంటలను గురువారం మారుటేరు ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, డాక్టర్ శేఖర్, డాక్టర్ దక్షిణామూర్తి, జగ్గంపేట ఎడిఎ జి. శ్రీనివాసరావు, ఏఓ ఎస్. నరసింహం క్షేత్ర సందర్శన చేసి సూచనలు చేసారు. వరి పంటకు జరిగే నష్ట తీవ్రతను తగ్గించుకోవడానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకు పొలం నుండి వర్షపు నీటిని ఎప్పటికప్పుడు అవకాశాన్ని బట్టి బయటకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి రూ.10,116 విరాళం

ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 29: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో కొలువై యున్న అతి పురాతన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు గురువారం భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఆలయానికి చేరుకుని స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా బొమ్మూరుకు చెందిన ప్రసాదరెడ్డి వెంకటనారాయణ దంపతులు ఆలయానికి రూ.10,116 విరాళంగా సమర్పించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం అందించారు.అనంతరం ఆలయ జూనియర్ అసిస్టెంట్ అధికారి ఎం. శ్రీనివాస్ దాత దంపతులను స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో ద్వారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో వరి పంటకు నష్టం తగ్గించుకునేలా జాగ్రత్తలు

- రైతులకు మారుటేరు శాస్త్రవేత్తల సూచనలు
- పంటలను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలి

గండేపల్లి, పెన్ పవర్ అక్టోబర్ 29: ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో గోదావరి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి పంటకు నష్టం తగ్గించుకునేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మారుటేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, డాక్టర్ శేఖర్, డాక్టర్ దక్షిణామూర్తి సూచించారు. గురువారం జగ్గంపేట వ్యవసాయ విభాగం సహాయ సంచాలకులు జి. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి జె. లక్ష్మితో కలిసి జగ్గంపేట, గండేపల్లి, ఏలేశ్వరం మండలాల్లో తుఫాను ప్రభావానికి గురైన వరి, అరటి, మినుము పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

ప్రస్తుతం వరి పంట వివిధ దశల్లో ఉందని, పూత దశ, పాలుపోసుకునే దశ, గింజ గట్టిపడే దశ, కోత దశల్లో ఉన్న పంటలకు వర్షాల వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలని సూచించారు.

పంట దశలను బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పూత దశకు ముందు ఉన్న పంటల్లో: ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204 వంటి వరి రకాల్లో వర్షాలు తగ్గిన తర్వాత ఎండ తీవ్రత పెరిగితే ఎండాకు తెగులు, మానిపండు తెగులు, మాగుడు తెగులు, ఆకుముడత, దోమపోటు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు.

ఈనిక దశలో ఉన్న పంటల్లో: పొట్ట నుంచి ఈనిక వచ్చే దశలో పంట నేలకొరిగి, కంకులు ఒక రోజు పాటు నీటిలో మునిగినా 75 శాతానికి పైగా తాలు గింజలు ఏర్పడి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

పూత దశలో ఉన్న పంటల్లో: ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318, ఎంటీయూ 1262, ఎంటీయూ 1224 రకాల పంటల్లో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ధాన్యం రంగు మారడంతోపాటు మానిపండు, మాగుడు తెగుళ్ల వ్యాప్తి చెందవచ్చని తెలిపారు.

పాలుపోసుకునే దశలో: స్వర్ణ, సంపద స్వర్ణ రకాల పంటలు వర్షాలకు నేలకొరిగితే పొలాల్లోని నీటిని అంతర్గత కాలువల ద్వారా బయటకు పంపించాలి. నిలబడిన, నేలకొరిగిన పంటల్లో ధాన్యం రంగు మారకుండా, మాగుడు, మానిపండు తెగుళ్ల వ్యాప్తిని తగ్గించేందుకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రోపికోనజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు.

గింజ గట్టిపడే దశలో: నిరంతర వర్షాల వల్ల గింజల్లోని నిద్రావస్థ తొలగి, నిలబడిన లేదా నేలకొరిగిన పంటల్లోనే గింజలు మొలకెత్తే ప్రమాదం ఉందని తెలిపారు.

కోత దశలో: నిలిచిన లేదా నేలకొరిగిన పంట కంకుల్లో మొలకలు కనిపిస్తే పొలాల్లోని నీటిని బయటకు పంపిన అనంతరం లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపిన ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. దీనివల్ల గింజలు మొలకెత్తడం, రంగు మారడం కొంతవరకు తగ్గుతుందని తెలిపారు.

కోసిన ధాన్యాన్ని కాపాడుకోవాలి

కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని, ఇప్పటికే కోసి కుప్పలుగా వేసిన ధాన్యాన్ని బరకాలతో కప్పి వర్షం నుంచి రక్షించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. నూర్చిన ధాన్యాన్ని రెండు మూడు రోజులపాటు ఆరబెట్టే అవకాశం లేకపోతే, గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉండేందుకు ప్రతి క్వింటా ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలపాలని తెలిపారు.

తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ

పంటల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే లీటరు నీటికి ఒక మిల్లీలీటరు ప్లాంటోమైసిన్, రెండు గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

వర్షపు నీరు తగ్గిన తరువాత మాగుడు తెగులు నివారణకు ఎకరాకు 400 మిల్లీలీటర్ల హెక్సాకోనజోల్ లేదా 200 మిల్లీలీటర్ల ప్రోపికోనజోల్ పిచికారీ చేయాలన్నారు. మానిపండు తెగులు వ్యాప్తిని తగ్గించేందుకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రోపికోనజోల్ వినియోగించాలని తెలిపారు.

ఆకుముడత పురుగు నివారణకు ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 60 మిల్లీలీటర్ల క్లోరాన్‌ట్రానిలిప్రోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

దోమపోటు, మాగుడు, మానిపండు తెగుళ్ల నివారణకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రోపికోనజోల్‌తో పాటు 120 గ్రాముల పైమెట్రోజైన్ లేదా 96 మిల్లీలీటర్ల ట్రైఫ్లుమెజోపైరిమ్ పది శాతం ఎస్‌సీ మందును కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసేందుకు అందుబాటులో ఉన్న వ్యవసాయ డ్రోన్లను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.అనంతరం మల్లేపల్లి సహకార సంఘం వద్ద నిర్వహించిన రైతు సదస్సులో అధికారులు, శాస్త్రవేత్తలు తుఫాను ప్రభావిత పంటల సంరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.గమనిక: పంటలకు మందులు పిచికారీ చేసే ముందు స్థానిక వ్యవసాయాధికారి లేదా వ్యవసాయ శాస్త్రవేత్తను సంప్రదించి, మందుల మోతాదులు, అనుకూలత, కలిపి వాడే విధానాన్ని నిర్ధారించుకోవాలి.

ఆర్నబ్ తుఫాన్ దెబ్బకు రైతులకు కన్నీళ్లే!

- నేలకొరిగిన పంటలు.. దెబ్బతిన్న ఇళ్లు, తోటలు
- బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి
- ప్రజాసేవకుడు గండ్రోతు దుర్గాసురేష్

రావులపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 29: ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో రైతులు, నిరుపేదలు, చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని ఈతకోట గ్రామానికి చెందిన ప్రజాసేవకుడు గండ్రోతు దుర్గాసురేష్ తెలిపారు. తుఫాన్ ధాటికి పంటలు దెబ్బతినడంతో పాటు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకూలాయని, ఇళ్లు, రేకుల షెడ్లు దెబ్బతిని పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నష్టపోయిన బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని కోరారు.

పంట నష్టాల పరిశీలన

దుర్గాసురేష్ మంగళ, బుధవారాల్లో ఈతకోట గ్రామంలో పర్యటించగా, గురువారం ఈతకోటతో పాటు రావులపాలెం మండలంలోని గోపాలపురం, పొడగట్లపల్లి, కేతరాజుపల్లి, దేవరపల్లి, రావులపాడు తదితర గ్రామాల పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. రైతులతో కలిసి దెబ్బతిన్న వరి చేలు, అరటి, కొబ్బరి తోటలు, వంగ, చిక్కుడు, బెండ, మునగ తదితర కూరగాయ పంటలను పరిశీలించారు. పంటల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు.

అరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, అర్హులైన రైతులందరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని కోరారు.

విద్యుత్తు అంతరాయంతో తాగునీటి కష్టాలు

తుఫాన్ ధాటికి విద్యుత్తు స్తంభాలు నేలకూలడంతో పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని దుర్గాసురేష్ తెలిపారు. విద్యుత్తు లేకపోవడంతో తాగునీటి సరఫరా కూడా ప్రభావితమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నేలకూలిన చెట్లు, విరిగిన విద్యుత్తు స్తంభాలను తొలగించి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను కోరారు.

బాధితులను ఆదుకోవాలి

తుఫాన్ కారణంగా తాటాకు ఇళ్లు, రేకుల ఇళ్లు, షెడ్లు దెబ్బతిన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని దుర్గాసురేష్ విజ్ఞప్తి చేశారు. జీవనోపాధి కోల్పోయిన చిరు వ్యాపారులను ఆదుకోవడంతో పాటు దెబ్బతిన్న రహదారులు, విద్యుత్తు వ్యవస్థలను పునరుద్ధరించాలని కోరారు.రైతు పండించే ప్రతి గింజ వెనుక నెలల తరబడి శ్రమ, పెట్టుబడి, కుటుంబ సభ్యుల ఆశలు ఉంటాయి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినప్పుడు రైతులను ఒంటరిగా వదిలేయకూడదు. అన్నదాతను ఆదుకుంటేనే వ్యవసాయం నిలుస్తుంది. రైతు కుటుంబాలు నిలబడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. తుఫాన్ బాధితులకు తక్షణ సహాయం అందించి, వారు సాధారణ జీవనం సాగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని గండ్రోతు దుర్గాసురేష్ కోరారు.

తుఫాన్ బాధితులకు అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

చిన్నారులు, వృద్ధులకు దుప్పట్లు.. మహిళలకు మఫ్లర్ల పంపిణీ

మూడు గ్రామాల్లో రెండు రోజులుగా అన్నదాన కార్యక్రమం

రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 29 అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. రావులపాలెం మండలంలోని ఊబలంక, రావులపాలెం, రావులపాడు గ్రామాల్లో తుఫాన్ బాధితులకు గత రెండు రోజులుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం చిన్నారులు, వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు మఫ్లర్లను పంపిణీ చేశారు.తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఆహారంతో పాటు అవసరమైన వస్తువులను అందించాలనే ఉద్దేశంతో ట్రస్ట్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆహారం అందించడంతో పాటు చిన్నారులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మహిళలకు మఫ్లర్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ మోహిత్ సీత, శ్యామ్ అన్నపూర్ణ, ఊబలంక పంచాయతీ కార్యదర్శి సర్వరాజు, గ్రామ రెవెన్యూ అధికారి లక్ష్మీపతిరావు తదితరులు పాల్గొన్నారు. బాధితులకు సహాయక సామగ్రిని అందజేశారు.ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావించి ట్రస్ట్ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, దుప్పట్లు, ఇతర అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారికి కొంత ఉపశమనం కల్పించారు. ఆపద సమయంలో తమకు సహాయం అందించిన ట్రస్ట్ సభ్యులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంలో పాత్రికేయుల పాత్ర ప్రశంసనీయమైనది

-ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్,బి చంద్రమోహన్.

కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,అక్టోబర్,29: సమాజంలో పాత్రికేయుల పాత్ర ప్రశంసనీయమైనదని ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్,బళ్ళ చంద్రమోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ప్రత్తిపాడు ఎంపిడిఓ కార్యాలయం వద్ద ప్రత్తిపాడు విలేకరులకు జె.ఎన్.టి.యు పూర్వ విద్యార్థి,ఇ.ఇ, కె వేణుగోపాల్ ఆర్థిక సౌజన్యంతో ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొదటి ధపా ఉచితంగా రైయిన్ కోట్ లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ సమాజంలో ప్రజా సమస్యలను వెలికి తీయడమే కాకుండా, సమస్యలను పరిష్కరించడంలో తనదైన ముద్ర వేసుకున్న ఘనత పాత్రికేయులకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు కుంభవృష్టిగా కురుస్తున్న నేపథ్యంలో పాత్రికేయుల విధులకు ఆటంకం లేకుండా తమ వంతు సహకారంగా విలేకరులకు రెయిన్ కోట్ లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఏడిద రెడ్డినాయుడు, గొంప రామకృష్ణ, కె సంజీవరావు, డి సాకేత్ వర్మ, పలువురు పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

నేడు కాకినాడ జిల్లాలో పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

కాకినాడ,అక్టోబర్ 29 పెన్ పవర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలో నవంబరు నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 30వ తేదీన పంపిణీ చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నవంబరు 1న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, 5న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పింఛన్ల పంపిణీ తేదీని ముందుకు మార్చినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి నగదును ముందుగానే సిద్ధం చేసుకోవాలని, వృద్ధులు,దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా పింఛన్లు అందించాలని సూచించారు. పంపిణీలో జాప్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ,నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఆర్నబ్ తుఫాన్‌తో 8,900 ఎకరాల్లో వరి పంటకు నష్టం

- నేలవాలిన, ముంపునకు గురైన పంటల పరిశీలన
- రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు

ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 29:తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంట వివరాలను గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల ద్వారా అధికారులు క్షేత్రస్థాయిలో నమోదు చేస్తున్నారు. ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్‌కేవీ చౌదరి, మండల వ్యవసాయ అధికారి బి. మీనా, గ్రామ వ్యవసాయ సహాయకులు పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

పంటను కాపాడుకునేందుకు సూచనలు

వర్షాల కారణంగా పొలాల్లో నిలిచిన నీటిని కాలువల ద్వారా వెంటనే బయటకు పంపించాలని అధికారులు సూచించారు. నేలవాలిన వరి పంటను సాధ్యమైన చోట జాగ్రత్తగా కట్టలుగా కట్టి నిలబెట్టాలని తెలిపారు. వర్షాలు తగ్గి, పిచికారీకి అనుకూల వాతావరణం ఏర్పడిన తర్వాత వరి పంటలో తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక మిల్లీలీటరు ప్రాపికోనజోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఎకరానికి 200 మిల్లీలీటర్ల మోతాదును పాటించాలని పేర్కొన్నారు. అదేవిధంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలో వర్షాల కారణంగా గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు) పిచికారీ చేయాలని సూచించారు.

అధికారుల సూచనలు పాటించాలి

తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు తమ పొలాల్లో పంట పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. పంట నష్టానికి సంబంధించిన వివరాల నమోదు కొనసాగుతోందని తెలిపారు.

అర్నాబ్ తుఫాన్‌తో వరి రైతులకు తీవ్ర నష్టం

- పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం
- ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం
- డాక్టర్ మునిరత్నం

కాజులూరు, పెన్ పవర్ అక్టోబర్ 29: అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో వరి పంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం గురువారం కాజులూరు మండలంలోని పల్లిపాలెం, నామవానిపాలెం, కోలంక గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించింది. తుఫాన్ కారణంగా వరి పంట నేలకొరగడం,పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు సామర్లకోట, పెదపూడి, కాజులూరు, తాళ్లరేవు మండలాల్లో పర్యటిస్తూ పంట నష్టం తీవ్రత, పంట దశ, పొలాల్లోని పరిస్థితులను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. వ్యవసాయ శాఖ సూచించిన సస్యరక్షణ చర్యలను పాటించడం ద్వారా పంట నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.క్షేత్రస్థాయి పరిశీలనల అనంతరం నష్టంపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని డాక్టర్ మునిరత్నం వెల్లడించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ దక్షిణామూర్తి,డాక్టర్ రామభద్రరాజు,డాక్టర్ సీతారామశర్మ, డాక్టర్ సుధీర్,డాక్టర్ బిందు ప్రవీణ,మండల వ్యవసాయ అధికారి వి.అశోక్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, శ్రీనివాస్ వర్మ, వ్యవసాయ సహాయకులు సాయి ప్రసన్న,చిన్న, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దంతులూరి వెంకట నరసింహరాజు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబురాజు,స్థానిక రైతులు బొండా వెంకట నరసింహ నాయుడు,కంబాల వీరబాబు,నామా సీతారాం,నందికోళ్ల సత్తిబాబుతో పాటు రైతులు,కౌలు రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా కూటమి నాయకులు

ట్యాంకర్ ద్వారా తాగునీటి పంపిణీ

ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 29:ఆర్నబ్ తుఫాను ప్రభావంతో ఆలమూరు గ్రామంలోని ఎర్ర కాలనీలో తలెత్తిన తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కూటమి నాయకులు ముందుకు వచ్చారు. స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి, ఈదల రాంబాబు ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని పంపిణీ చేశారు.తుఫాను కారణంగా ఏర్పడిన ఇబ్బందుల నేపథ్యంలో కాలనీ ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో భాగంగా నీటి సరఫరా చేపట్టి స్థానికులకు అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఈదల నల్లబాబు, రావాడ సత్తిబాబు, వంటిపల్లి సతీష్,శిరిగినీడి పట్టాభి,మానేపల్లి శీను, చీపురుపల్లి గణేష్, వంటపాటి అర్జున్‌తో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు నాయకులు చర్యలు చేపట్టారు.

నవంబర్ 6తో దరఖాస్తుల గడువు ముగింపు

- అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కాకినాడ, అక్టోబర్ 29 ,పెన్ పవర్: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. 2021లో 17,285 దరఖాస్తులు అందగా, ప్రస్తుతం 5,086 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు. నవంబర్ 6, 2026తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడిని ఓటరుగా నమోదు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, ఫారం-19 ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించేలా చూడాలని సూచించారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యాసంస్థల యాజమాన్యాల సహకారం తీసుకుని రానున్న రోజుల్లో నమోదులో గణనీయమైన పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగన్నాథం, డిప్యూటీ తహసీల్దార్ తేజ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత వరి పొలాలను పరిశీలించిన ఏఓ నాగం సుధామాధురి.

కిర్లంపూడి,పెన్ పవర్, అక్టోబర్,29:కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని రాజుపాలెం, వీరవరం, ముక్కోల్లు, గోనేడ, తామరాడ గ్రామాల్లో ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన వరి పొలాలను గురువారం మండల వ్యవసాయశాఖ అధికారిణి నాగం సుధామాధురి పరిశీలించారు. తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించి, రైతులకు పలు సలహాలు,సూచనలు అందచేశారు. ప్రతి గ్రామంలోని వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిస్తారని తెలిపారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉన్న పొలాల్లో మురుగు కాలువల ద్వారా నీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. నీరు తగ్గిన తర్వాత ఎకరాకు హెక్సాకోనజోల్ 400 మి.లీ. లేదా ప్రోపికోనజోల్ 200 మి.లీ. పిచికారీ చేయడం ద్వారా మొక్కజొన్న తెగులును నివారించవచ్చని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎండ తీవ్రత పెరిగి బ్యాక్టీరియా ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 1 మి.లీ.తో పాటు కాపర్ ఆధారిత కోసైడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కోత దశలో ఉన్న పంట నీటిలో నిలిచిపోయినా లేదా నేలపై పడిపోయినా, కంకుల్లో మొలకలు కనిపిస్తే వాటిని తొలగించి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి...

శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 19:- అర్నాబ్ తుఫాను ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు రైతులు పశీటల్లో జాగ్రత్తలు పాటించాలి అని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు.కాకినాడ జిల్లా శంఖవరం, మండపం గ్రామాల్లో వర్షాలకు వాలిన వరి, పత్తి పంటలను పరిశీలించి పొలాల్లో ఉన్న నీటిని తీసి, వర్షం వలన వచ్చే అధికనీటిని బయటకు పంపడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. పల్లపు ప్రాంతాలలో పొలాలు ఉన్నట్లయితే నీటిని నిలువ ఉండకుండా చూసుకోవాలి. వరిలో వర్షాలు తగ్గిన తర్వాత పొడ తెగులు నివారణకు హెక్సాకోన జోల్ 2మి .లీ.లేదా ఆజాక్సీస్ట్రోబిన్ 1మి .లీ. లీటరు నీటిలో కలిపి మొదళ్ళు తడిచేలా పిచికారీ చేసుకోవాలి.వరి పంట పూతదశలో ఉన్నపుడు మాణిపండు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున ప్రోపికొనజోల్ 1మి . లీ.లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.వరిపంట ఇంకా పిలకలు దశలో ఉంటె బూస్టర్ మోతాదుగా 20 కిలోలు యూరియా, 15 కిలోలు పొటాష్ ఎరువులను వేసుకోవాలి. పత్తి పంటలో పొలాన్ని ఆరబెట్టి బూస్టర్ డోసుగా యూరియా 25కిలోలు, పొటాష్ 10కిలోలు వేయడం వల్ల పంట నిలదొక్కుకుంటుశీది. కాయ కుళ్ళు, ఆకుమచ్చ తెగులు మరియు మొక్కలు వాడిపోవడం వంటి వాటి నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రా. లీటర్ నీటిలో కలిపి 10రోజుల వ్యవధిలో రెండు సార్లు మొక్కంతా తడిచేలా పిచికారీ చేయాలి. పత్తిలో పూత మరియు పిందెలు రాలకుండా ఉండడానికి పొటాషియం నైట్రేట్ 2 శాతం పిచికారీ చేయాలి. ఏ ఈ ఓ శ్రీనివాస్, ఉద్యాన సహాయకులు సురేష్, రైతులు పాల్గొన్నారు.ం

అర్నబ్ తుఫాన్‌తో దెబ్బతిన్న పంటల పరిశీలన

- నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి: చిర్ల జగ్గిరెడ్డి
- పెనికేరు, పినపల్ల, చింతలూరు, సూర్యారావుపేట గ్రామాల్లో పంట నష్టాల పరిశీలన

ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 29:తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు వెంటనే పర్యటించి పంట నష్టాలను సమగ్రంగా అంచనా వేయాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, నష్టపోయిన ప్రతి రైతు వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కౌలు రైతులను కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని వారికి న్యాయం చేయాలని అన్నారు. నష్టపరిహారం అందించడంలో జాప్యం జరిగితే రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల నష్టాల అంచనా నుంచి పరిహారం మంజూరు వరకు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.రైతులు అధైర్యపడవద్దని,ఈ కష్టకాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని చిర్ల జగ్గిరెడ్డి భరోసా ఇచ్చారు. రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ధర్మవరంలో తుఫాను ప్రభావిత పత్తి పంటలను పరిశీలించిన ఏఓ జోకా అమృత.

- సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సలహాలు,సూచనలు అందజేత.

కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,అక్టోబర్,29:అర్నాబ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను కాపాడుకుని, దిగుబడి నష్టాన్ని తగ్గించుకునేందుకు రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత సూచించారు. గురువారం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో తుఫాను ప్రభావానికి గురైన పత్తి పంటలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్ట తీవ్రతను అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.పత్తి చేలల్లో నిలిచిన వర్షపు నీటిని కాలువల ద్వారా వెంటనే బయటకు పంపించాలని సూచించారు. పంట త్వరగా కోలుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎకరానికి 25--30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వినియోగించాలన్నారు. పూత, పిందె రాలకుండా పంట పరిస్థితిని బట్టి తగిన సస్యరక్షణ మందులను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయాలని తెలిపారు. కాయకుళ్లు,ఆకుమచ్చ తెగుళ్ల వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్కలు వాడిపోతున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణం అనుకూలించిన వెంటనే పగిలిన, ఎండిన పత్తి కాయలను ఏరి, తేమ లేకుండా ఆరబెట్టుకోవడం ద్వారా నాణ్యతను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు అధైర్యపడకుండా, సూచించిన సస్యరక్షణ చర్యలు చేపట్టి పంట నష్టాన్ని తగ్గించుకోవాలని ఏఓ జోకా అమృత కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది,పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

- పక్షవాతం లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయొద్దు: వైద్యులు

కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 29: ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ రామారావుపేటలోని సమన్వి న్యూరో వైద్యశాలలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. న్యూరో ఫిజీషియన్ డాక్టర్ అడబాల గోపీకృష్ణ ప్రజలకు పక్షవాతం లక్షణాలు,కారణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, పక్షవాతం లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యం పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పక్షవాతం వచ్చినప్పుడు మొదటి 4.5 గంటలు అత్యంత కీలకమని, వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తే ప్రాణాపాయాన్ని, శాశ్వత వైకల్య ప్రమాదాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.డాక్టర్ అడబాల గోపీకృష్ణ మాట్లాడుతూ మెదడుకు రక్త సరఫరాలో అంతరాయం ఏర్పడటం లేదా మెదడులో రక్తనాళం చిట్లడం వల్ల స్ట్రోక్ సంభవించవచ్చని వివరించారు. పక్షవాతం లక్షణాలను గుర్తించేందుకు ఫాస్ట్ సూత్రాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ముఖం ఒకవైపుకు వంగడం (ఫేస్), ఒక చేయి బలహీనపడటం, మాట తడబడటం లేదా మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలని తెలిపారు.అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ పక్షవాతం ముప్పును పెంచుతాయని చెప్పారు. బీపీ, షుగర్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ నియంత్రణలో ఉంచుకోవాలని, ఉప్పు, నూనె వినియోగాన్ని తగ్గించి పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయడంతో పాటు పొగతాగడం, మద్యపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు

- అక్రమాలు, ప్రలోభాలపై నిఘా
- ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలి
- ఎస్పీ బిందు మాధవ్

కాకినాడ, అక్టోబర్ 29 పెన్ పవర్: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల పోలీసు బృందాలు సమగ్రంగా సిద్ధంగా ఉండాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల బందోబస్తు,శాంతిభద్రతల పరిరక్షణపై పలు సూచనలు చేశారు.రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్,క్యూఆర్టీ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, అక్రమ మద్యం, నగదు, బహుమతుల తరలింపును అడ్డుకోవాలని ఆదేశించారు.ఎన్నికల విధులకు కేటాయించిన వాహనాలు, కమ్యూనికేషన్ పరికరాలు, సీసీటీవీ, డ్రోన్ కెమెరాలు, ఇతర భద్రతా సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఓటర్లను భయపెట్టడం, ప్రలోభపెట్టడం, పోలింగ్‌కు ఆటంకం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సోషల్ మీడియాలో వదంతులు, అసత్య ప్రచారాలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు అవసరమైన సహకారం అందిస్తూ, పోలీసు సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా భద్రత కల్పిస్తామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. అత్యవసర పోలీసు సేవల కోసం కాకినాడ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లు 9490619297, 9490619298 లేదా 112కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు డాక్టర్ మహంతి కిషోర్ కుమార్,ఎస్. శ్రీనివాసరావు,డీఎస్పీలు,సీఐలు, ఎస్సైలు,ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ప్రావీణ్యత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కాకినాడ జిల్లాలో 282 మంది అభ్యర్థులు
- పరీక్షా సమయానికి గంట ముందే చేరుకోవాలి
- డీఆర్వో తిప్పేనాయక్

కాకినాడ,అక్టోబర్ 29 పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 30, 31 తేదీల్లో నిర్వహించనున్న కంప్యూటర్ ప్రావీణ్యత పరీక్ష (సీపీటీ)కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పేనాయక్ అధికారులను ఆదేశించారు.గురువారం నిర్వహించిన సన్నద్ధత సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జరిగే ఈ పరీక్షకు మొత్తం 282 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా సమయానికి కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.పరీక్షలు రోజుకు మూడు సెషన్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు,రెండో సెషన్ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు. కంప్యూటర్లు,ఇంటర్నెట్,ఫర్నిచర్, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే తనిఖీ చేయాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు,వైద్య సేవలు, రవాణా సదుపాయాలు కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అభ్యర్థులు సెల్‌ఫోన్లు,ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావద్దని స్పష్టం చేశారు.పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ మహేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు,పోలీసు అధికారులు,ఏపీఈపీడీసీఎల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్ణబ్ తుఫాన్‌తో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన బండారు శ్రీనివాస్

- చొపెల్ల, నర్సిపూడి, నవాబుపేట, కలవచర్ల గ్రామాల్లో పర్యటన
- రైతులతో పంట నష్టాలపై చర్చ

ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 29: అర్ణబ్ తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆలమూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. చొపెల్ల, నర్సిపూడి, నవాబుపేట, కలవచర్ల గ్రామాల్లో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బాధిత రైతులతో నేరుగా మాట్లాడి, పంటల సాగు, జరిగిన నష్టం, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసిన రైతులు ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టపోవడం పట్ల బండారు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం కొంత ఊరటనిచ్చే అంశమని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచి, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఉద్యానవన పంటల రైతులు నష్ట నివారణకు మెలుకువలు పాటించాలి: ఎమ్ హెచ్ ఓ దివ్యశ్రీ.

ఏలేశ్వరం, పెన్ పవర్ , అక్టోబర్ 29 : ఉద్యానవన పంటల రైతులు నష్ట నివారణకు మెలుకువలు పాటించాలని మండల హార్టికల్చర్ ఆఫీసర్ కే దివ్యశ్రీ పిలుపునిచ్చారు. మండల పరిధిలో యర్రవరం, తిరుమాలి, ఏలేశ్వరం , పేరవరం గ్రామాలలో అర్నబ్ తుఫాన్ వల్ల నష్టపోయిన అరటి , కూరగాయల పంటలను ఉద్యానవన శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ప్రస్తుతానికి అరటి , కూరగాయలు ,బొప్పాయి తదితర ఉద్యానవన పంటలు 238 ఎకరాలు పంట నష్టం ప్రాథమిక అంచనా వేయటం జరిగింది అని దివ్యశ్రీ తెలిపారు.ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యాన పంటల నష్టం అంచనా వేసి పై అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యానవన యాజమాన్య పద్ధతులు నష్ట నివారణ పద్ధతులు వివరించారు. నిల్వ నీటిని వెంటనే తొలగించాలి.పడిపోయిన మొక్కలను నిలబెట్టి మట్టి ఎత్తి, అవసరమైతే కర్రలతో ఆసరా ఇవ్వాలి.విరిగిన కొమ్మలు, కుళ్లిన ఆకులు/కాయలను తొలగించాలి.వర్షం తర్వాత ఆకుమచ్చ, కుళ్లు వంటి సమస్యలు కనిపిస్తే కాపర్ ఆక్సి క్లోరైడ్ 0.3% , మంకోజెబ్ 0.25% లేబుల్ సిఫారసు ప్రకారం పిచికారీ చేయాలి. కాండం/వేరుకుళ్లు రాకుండా బ్లిటాక్స 3గ్రామాలు లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క మొదల్లో పోయాలి . అలాగే మిగిలిన వివరాలు కోసం అగ్రికల్చర్ సిబ్బందిని కలిసి సలహాలు సూచనలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

దెబ్బతిన్న ఉద్యానవన పంటలు పరిశీలన

జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 29: జగ్గంపేట మండలంలో దెబ్బతిన్న ఉద్యానవన పంటలను గురువారం జగ్గంపేట ఉద్యానవన శాఖ అధికారి ఎం.శ్రీవల్లి సిబ్బంది పరిశీలించారు. అరటి 24.40 హెక్టార్లు, బొప్పాయి 14 హెక్టార్లు, కూరగాయలు 22.60 హెక్టార్లు, వదులు పూలు 1 హెక్టారు కలిపి మొత్తం ఉద్యాన పంటలు 62.05 హెక్టార్లకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఆర్నబ్ తుఫాను ప్రభావంతో పంట నష్టం జరిగిన రైతుల వివరాలను ఉద్యాన శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో సేకరించి, గ్రామాల వారీగా మరియు పంటల వారీగా పరిశీలించడం జరుగుతుందన్నారు. పంట నష్టం విస్తీర్ణం, నష్టం శాతం తదితర వివరాలను ధృవీకరణ అనంతరం సంబంధిత అధికారులకు నివేదించడం జరుగుతుంది. రైతులు పంట నష్టం వివరాల నమోదు కోసం సంబంధిత గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించి అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్ర్రాలు నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలి.సి డి పి ఓ సంధ్యారాణి.

గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 29:–తుఫాను నేపథ్యం లో అంగన్వాడీ కేంద్రాల పరిధిలో చిన్నపిల్లలు, గర్భిణీలు, బాలింతల భద్రత దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుకొండ సి డి పి ఓ (సమగ్ర శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి) సంధ్యారాణి ఆదేశించారు. గోకవరంలోని మీడియాకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి ఉత్తర్వుల మేరకు ప్రాజెక్టు పరిధిలోని సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.భారీ వర్షాలు,ఈదురుగాలుల సమయం లో పిల్లల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి. శిథిలావస్థలో ఉన్న భవనాలు, రేకుల షెడ్లలో ఈ తుఫాను కారణంగా పరిస్థితిని అంచనా వేసుకునే పిల్లలను ఉంచాలని కేంద్రాల్లోని ఆహార పదార్థాలు, రికార్డులు,సామగ్రిని సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. గర్భిణీలు,బాలింతలు,చిన్నపిల్లల భద్రత మరియు అంటూ రాగా లాంటివి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన స్థానిక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి పలు సూచనలు చేయాలని,కేంద్రాల పరిసరాల్లో నీరునిల్వ ఉండకుండా విద్యుత్ తీగలు పరిశీలించుకోవాలని, తుఫాను కారణంగా తడిసిపోయి ఉండడం తో ప్రమాదకర చెట్లు, గోడల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కుటుంబాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ,లబ్ధిదారులకు అవసరమైన సహాయ చర్యల కోసం స్థానిక అధికారు లతో సమన్వయం చేసుకోవాలి.భవన భద్రతను నిర్ధారించి, ఉన్నతాధికారుల సూచన మేరకు కేంద్రాలను తిరిగి నిర్వహించాలి వేడివేడి ఆహారాలు మాత్రమే తినేలా బాలింతలకు గర్భిణీలకు సూచనలు ఇవ్వాలని కోరుకొండ సి డి పి ఓ సంధ్యారాణి ఆదేశాలు జారిచేసారు.

వరద ప్రవాహాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చెరువులు, కాలువలు, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లొద్దు

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కాకినాడ, అక్టోబర్ 29 ,పెన్ పవర్: అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద ప్రవాహాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు.వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదుల్లో ఆకస్మికంగా వరద ప్రవాహం పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు వాటి సమీపానికి వెళ్లకూడదని హెచ్చరించారు.పిల్లలు వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దలు సైతం వరద నీటిలోకి దిగడం,ప్రవాహాలను దాటేందుకు ప్రయత్నించడం చేయరాదని తెలిపారు.వరద నీటితో నిండిన రహదారులు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల గుండా ప్రయాణించవద్దని సూచించారు. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ,అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలకు సహకరించాలని కోరారు.తుఫాన్,భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా యంత్రాంగం సహాయక,రక్షణ చర్యలను కొనసాగిస్తోందని తెలిపారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.విపత్తు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com